ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



నంద్యాల
జిల్లా వార్తలు

శుక్రవారం 16 మే 2025

ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక

ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలచుకున్న వారు అలాగే ప్రస్తుత చందాదారులకు పేపర్ పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఈ క్రింది ఫోన్ నెంబర్లను సంప్రదించగలరు.

కర్నూలు, డోన్, ఆత్మకూరు, కల్లూరు	- 99854 09260
కర్నూలు, కోడుమూరు, నందికొట్కూరు	- 9985411379
ఆదోని, ఆలూరు, పత్తికొండ, ఎమ్మిగనూరు	- 9985171793
నంద్యాల, పాణ్యం, ఆళ్ళగడ్డ, బనగానపల్లె	- 9985411377

రోడ్లకు మోక్షం

వైసీపీ ప్రభుత్వంలో అభివృద్ధి పనులు చేపట్టకపోవడంతో ప్రజలు తీవ్ర అవస్థలు పడ్డారు. ఐదేళ్ల పాలనలో నరకయాతన అనుభవించారు. గుంతలమయమైన రోడ్లపై ప్రయాణించాలంటే వణికిపోయేవారు. ఏళ్లతరబడి పేరుకుపోయిన సమస్యలకు ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం పరిష్కారం చూపుతోంది. రోడ్లకు మహర్దశ తీసుకువచ్చేందుకు కృషి చేస్తోంది. ఈ నేపథ్యంలోనే రాష్ట్ర విపత్తు నివారణ నిధుల నుంచి నంద్యాల జిల్లాకు రూ.30 కోట్లు మంజూరు చేశారు. రూ.10కోట్లతో గుంతలను పూడ్చివేత పనుల కార్యక్రమం పూర్తి చేశారు. కాగా మిగిలిన రూ.20 కోట్లతో బ్రిడ్జిలు, కల్వర్టులు నిర్మించేందుకు అధికారులు సిద్ధమయ్యారు. బనగానపల్లె నియోజకవర్గానికే అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. మంత్రి ఇలాకాపైనే అధికారుల దృష్టి సారించారు.

- ఇప్పటికే రూ.10కోట్లతో గుంతల పూడ్చివేత పూర్తి
- రూ.20కోట్లతో కల్వర్టులు, వంతెనల నిర్మాణం
- ఏళ్లతరబడి ఉన్న సమస్యలకు పరిష్కారం
- రూ.48కోట్ల రహదారి పనులకు పరిపాలన అనుమతులు
- బనగానపల్లె నియోజవకర్గంపైనే ప్రత్యేక దృష్టి

నంద్యాల హాస్పిటల్, మే 15, (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్ర వ్యాప్తంగా రోడ్లకు మోక్షం లభించింది. రాష్ట్ర విపత్తు నివారణ నిధుల నుంచి రాష్ట్రంలో రూ.860 కోట్ల పనులు మంజూరయ్యాయి. నంద్యాల జిల్లాకు రూ.30 కోట్లు మంజూరు చేశారు. ఇందులో రూ.10కోట్లతో గుంతల రహిత రహదారుల కార్యక్రమంలో భాగంగా గుంతల పూడ్చివేత వంద శాతం పూర్తి చేశారు. రాష్ట్రంలో అగ్ర స్థానంలో నంద్యాల ఆర్అండ్‌బీ శాఖ నిలిచింది. మిగిలిన రూ.20.1కోట్లతో జిల్లాలో కల్వర్టులు, బ్రిడ్జిల నిర్మాణం చేపట్టారు. నవంబర్‌లో ప్రారంభమైన ఈ పనులు జిల్లాలో చురుగ్గానే సాగుతున్నాయి. ఒక్కొక్క కల్వర్టుకు దాదాపు రూ.30లక్షలు, బ్రిడ్జిల నిర్మాణానికి రూ.2కోట్లుపైనే ఖర్చు చేస్తున్నారు. బ్రిడ్జిల నిర్మాణం డిసెంబర్‌లోపు పూర్తిచేయాల్సి ఉంది. కల్వర్టుల నిర్మాణం జూలైకి పూర్తిచేయాల్సి ఉంది. జిల్లా వ్యాప్తంగా 20పనులకు నిధులు మంజూరుకాగా 19పనులు చేపట్టారు. మేజర్ డిస్ట్రిక్ట్ రోడ్స్ (ఎండీఆర్)కింద రూ.48కోట్లు మంజూరయ్యాయి. ఈ నిధులతో 19రోడ్డు పనులు చేసేందుకు పరిపాలనా అనుమతులు వచ్చాయి. నంద్యాల జిల్లాలో ఆర్‌అండ్‌బీ శాఖ పరిధిలో 1512 కి.మీ.రోడ్లు ఉన్నాయి. ఇందులో అత్యధికంగా బనగానపల్లె నియోజకవర్గంలో ఈ శాఖ పరిధిలో 450కి.మీ.ఉంది. దీంతో ఎక్కువగా బనగానపల్లె నియోజకవర్గం లోని రోడ్లపై అధికారులు దృష్టి సారిస్తున్నారు. అంతేకాకుండా రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి ఈ నియోజకవర్గం నుంచే ప్రాతినిధ్యం వహిస్తుండటంతో రోడ్లకు మహర్దశ పడుతోంది.



పండ్లాపురం వద్ద బ్రిడ్జి నిర్మాణ పనులు

నిర్ణీత సమయంలోనే పనులు పూర్తిచేస్తాం

నంద్యాల జిల్లాలో చేపట్టిన కల్వర్టులు, బ్రిడ్జిల నిర్మాణ పనులు పూర్తి చేస్తాం. రెండు చోట్ల కల్వర్టుల పనులు ప్రారంభం కాలేదు. కాంట్రాక్టర్ ఒక్కరే కావడంతో సమస్య తలెత్తింది. ఆరెండు కల్వర్టులను కూడా పూర్తిచేస్తాం. వేల్పనూరు, యర్రగుడిదిన్నె గ్రామా ల వద్ద చేపట్టాల్సిన బ్రిడ్జి పనులకు ఇటీవలే టెండర్లు పిలిచాం. త్వరలోనే నిర్మాణ పనులు చేపడతాం. ఎస్.కొత్తూరు గ్రామానికి మంజూరైన బ్రిడ్జి నిర్మాణ విషయంలో డిజైన్ సమస్య తలెత్తింది. త్వరలోనే ఉన్నతాధికారులతో చర్చించి టెండర్లు పిలిచి పనులు ప్రారంభిస్తాం. బ్రిడ్జిల నిర్మాణ పనులకు డిసెంబర్ వరకు సమయం ఉన్నా సెప్టెంబర్‌కు పూర్తిచేస్తాం. కల్వర్టుల పనులు ఈ నెలాఖరుకల్లా పూర్తిచేస్తాం.

- శ్రీధర్‌రెడ్డి, ఈఈ, ఆర్అండ్‌బీ శాఖ, నంద్యాల

నిర్మాణ దశలో ఉన్న బ్రిడ్జి పనులు ఇలా

పాణ్యం నియోజకవర్గంలో కొణిదేడు వద్ద వద్దెల వాగు వంతెనకు రూ.2కోట్లతో నిర్మాణ పనులు జరుగుతున్నాయి. బనగానపల్లె నియోజకవర్గంలో తిమ్మాపురం వద్ద రూ.2కోట్లతో బ్రిడ్జి నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. బనగానపల్లె నియోజకవర్గంలో పండ్లాపురం గ్రామం వద్ద రూ.2కోట్లతో బ్రిడ్జి నిర్మాణ పనులు చేపడుతున్నారు. బనగానపల్లె నియోజకవర్గంలో కోవెలకుంట్ల తాలుకా వల్లంపాడు గ్రామం వద్ద రూ.2కోట్లతో బ్రిడ్జి నిర్మాణ పనులు సాగుతున్నాయి. ఆత్మకూరు నియోజకవర్గం మహానంది మండలం తమ్మడపల్లె గ్రామం వద్ద రూ.60లక్షలతో మైనర్ బ్రిడ్జి నిర్మాణ పనులు జరుగుతున్నాయి.



తిమ్మాపురం వద్ద జరుగుతున్న బ్రిడ్జి నిర్మాణ పనులు

ప్రారంభం కాని పనులు

ఆత్మకూరు నియోజకవర్గం వేల్పనూరు వద్ద రూ.2.3కోట్లతో బ్రిడ్జి నిర్మాణ పనులు ప్రారంభం కాలేదు. ఆళ్లగడ్డ నియోజకవర్గంలో ఎర్రగుడిదిన్నెవద్ద రూ.1.5కోట్లతో బ్రిడ్జి నిర్మాణ పనులు ప్రారంభించాల్సి ఉంది. పాణ్యం నియోజకవర్గం ఎస్.కొత్తూరు వద్ద రూ.2.3కోట్లతో బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలి. పాణ్యం నియోజకవర్గం కొణిదేడు-మద్దూరు రహదారిలో దాదాపు రూ.30లక్షలతో నిర్మించాల్సిన కల్వర్టు పనులకు మోక్షం లభించలేదు. ఆళ్లగడ్డ నియోజకవర్గం రుద్రవరం రహదారిలో దాదాపు రూ.30లక్షలతో నిర్మించాల్సిన కల్వర్టు పనులు ప్రారంభంకాలేదు.

పత్తి గరిష్ఠ ధర క్వింటం రూ.7,881

ఆదోని అగ్రికల్చర్, మే 15(ఆంధ్రజ్యోతి): ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో గురువారం పత్తి ధర క్వింటం గరిష్ఠంగా రూ.7881లకు వ్యాపారులు కొనుగోలు చేశారు. గతవారంతో పోల్చితే క్వింటానికి రూ.200 పైగా ధర తగ్గింది. సీజన్ ముగియడంతో పత్తి దిగుబడిలో నాణ్యత లేకపోవడంతోనే ధరలు తగ్గడానికి కారణమని వ్యాపారులు చెబుతున్నారు. 2725 క్వింటాళ్ల పత్తి విక్రయానికి రాగా కనిష్ఠ ధర రూ.4189, మధ్యస్థ ధర రూ.7,529 పలికింది.



విక్రయానికి వచ్చిన పత్తి దిగుబడి

ఏపీ ఈసెట్ ఫలితాలు విడుదల

జిల్లాలో 92.93 శాతం ఉత్తీర్ణత

నంద్యాల ఎడ్యుకేషన్, మే 15 (ఆంధ్రజ్యోతి): అనంతపురం జేఎన్‌టీయూ నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఇంజనీరింగ్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ ఫలితాలు గురువారం విడుదలయ్యాయి. డిప్లొమా, బీఎస్సీ(గణితం) డిగ్రీ విద్యార్థులు నేరుగా ఇంజనీరింగ్ ద్వితీయ సంవత్సరంలో చేరేందుకు ఈసెట్ నిర్వహించారు. పరీక్షను మే 6వ తేదీన రెండు విడతలుగా నిర్వహించారు. జిల్లాలో 801 మంది విద్యార్థులు అందులో బాలురు 597, బాలికలు 204 మంది బాలికలు రిజిస్టర్ చేసుకోగా పరీక్షలకు బాలురు 590, బాలికలు 202 మంది హాజరయ్యారు. బాలురులో 539 మంది క్వాలిఫై కాగా, బాలికల్లో 197 మంది క్వాలిఫై అయ్యారు. బాలురుల్లో 91.36శాతం, బాలికల్లో 97.52 శాతం ఉత్తీర్ణత సాధించారు. జిల్లాలో బాలబాలికలు కలిపి 92.93 శాతం ఉత్తీర్ణత సాధించారు.

సారా నిర్మూలనకు చర్యలు తీసుకోవాలి: డీఆర్వో

నంద్యాల నూనెపల్లె, మే 15 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో నవోదయం 2.0 ద్వారా సారా నిర్మూలనకు పకడ్బందీ చర్యలు చేపట్టాలని డీఆర్వో రామునాయక్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో నవోదయం-2.0 కార్యక్రమ పటిష్ట అమలుపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామస్థాయిలో సభలు నిర్వహించి ప్రజాప్రతినిధుల ద్వారా సారా దుష్ప్రభావాలను వివరిస్తూ కళాజాతాలతో ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. జిల్లాలో ఇప్పటివరకు 1 9గ్రామాలు ఏ-కేటగిరి, 19 గ్రామాలు బి-కేటగిరి, 91 గ్రామాలు సి-కేటగిరిలుగా గుర్తించామని తెలిపారు. వీఏవో, వీఆర్వో, సచివాలయ సిబ్బందితో కమిటీలు ఏర్పాటు చేశామని సంబంధిత వ్యక్తుల సహకారంతో తనిఖీలు నిర్వహించి నాటుసారా నియంత్రణకు చర్యలు తీసుకోవాలన్నారు. సారా మాన్పించేందుకు డీఆర్డీఏ, డ్వామా, మెప్మా సిబ్బందితో ఇంటింటి సర్వే ప్రక్రియ చేపట్టడంతోపాటు వారికి జీవనోపాధి కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఎక్సైజ్ అధికారి రవికుమార్, జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ, డీఎంహెచ్‌వో డా.వెంకటరమణ, డీఈవో జనార్దన్‌రెడ్డి, డీఎఫ్‌వో నాగమునేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఆర్వో రామునాయక్

భారత సైన్యానికి ప్రపంచంలోనే ప్రత్యేక గుర్తింపు

రచయిత, నటుడు శంకర్ రాజు 6

కేంద్ర నియంత్రణలోకి 'ఉపాధి' 7



టీజీవీ కళాక్షేత్రంలో నృత్యం చేస్తున్న కళాకారిణి

పకడ్బందీగా ఏర్పాట్లు చేపట్టండి


- ప్రతి షాపు వద్ద డస్ట్ బిన్లు ఏర్పాటు చేయాలి
- పనులు త్వరగా పూర్తి చేయాలి
- పార్కు సుందరీకరణ వివరాల ఫ్లెక్సీ ఏర్పాటు చేయాలి
- సీఎం పర్యటన ఏర్పాట్లను ఎస్పీతో కలిసి పరిశీలించిన కలెక్టర్



సి.క్యాంపు రైతు బజారులో ఏర్పాట్లను పరిశీలిస్తున్నకలెక్టర్, ఎస్పీ

కర్నూలు అగ్రికల్చర్, మే 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈనెల 17వ తేదీన సీ.క్యాంపు రైతుబజారులో పర్యటిస్తున్నారని, ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని వివిధ విభాగాల అధికారులను కలెక్టర్ రంజిత్ బాషా ఆదేశించారు. సీఎం పర్యటన సందర్భంగా రైతుబజారులో చేపట్టిన కార్యక్రమాలు, ప్రజా వేదికకు సంబంధించి చేస్తున్న ఏర్పాట్లను ఎస్పీతో కలిసి కలెక్టర్ గురువారం సాయంత్రం పరిశీలించారు. ప్రతి షాపు వద్ద డస్టుబిన్‌లను ఏర్పాటు చేయాలని, వాటికి నెంబర్లు వేయాలని అధికారులను ఆదేశించారు. రైతుబజారు షెడ్డుపైన ఎండ వేడిమి లేకుండా గ్రీన్‌షెడ్డు ఏర్పాటు చేయాలన్నారు. సమయం ఎక్కువగా లేనందున పనులు త్వరగా చేయాలని, ఎప్పటికప్పుడు పనులు ఎంతవరకు పూర్తయ్యాయో తనకు సమాచారం అందించాలని మార్కెటింగ్ శాఖ అధికారులను ఆదేశించారు. రైతుబజారు లోపల, బయట పరిసరాలు, మరుగుదొడ్లు శుభ్రంగా ఉండేలా చూసుకోవాలన్నారు. అనంతరం ధనలక్ష్మీనగర్‌లో స్వచ్ఛాంధ్ర పార్కుకు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేయనున్న సందర్భంగా అక్కడ కూడా ఏర్పాట్లను పరిశీలించారు. పార్కులో ప్లాంటేషన్ ప్రోగ్రాం ఏర్పాటు చేయాలని అటవీ శాఖ అధికారిని ఆదేశించారు. ఈ పార్కులో సుందరీకరణ వివరాలను తెలియజేసే విధంగా ఫ్లెక్సీని రూపొందించాలన్నారు. అనంతరం కేంద్రీయ విద్యాలయం పక్కన ఉన్న ఖాళీ స్థలంలో ప్రజావేదిక ఏర్పాట్లను అధికారులను అడిగి తెలుసుకున్నారు. బందోబస్తు, పార్కింగ్, వేదిక తదితర ఏర్పాట్లపై ఎస్పీ విక్రాంత్ పాటిల్, రైతుబజార్ స్టేట్ సీఈవో మాధవీలత, మార్కెటింగ్ శాఖ కమిషనర్ అండ్ డైరెక్టర్ విజయ సునీత, జేసీ నవ్య, పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు, కర్నూలు ఆర్డీవో సందీప్, జడ్పీ సీఈవో నాసరరెడ్డి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి పరిశీలించారు. అంతకుముందు సీఎం పర్యటన ఏర్పాట్లలో భాగంగా ఎస్పీతో కలిసి కలెక్టర్ ఓర్వకల్లు ఎయిర్‌పోర్టును పరిశీలించారు. అక్కడ భద్రతా ఏర్పాట్లను త్వరితగతిన పూర్తి చేయాలని డైరెక్టర్‌ను ఆదేశించారు.

రేపు కర్నూలుకు సీఎం చంద్రబాబు



కర్నూలు క్రైం, మే 15 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పర్యటనను ఉన్నతాధికారులు ఖరారు చేశారు. శనివారం సీఎం కర్నూలులో పర్యటించనున్నారు.

పర్యటన ఇలా:

- ఉదయం 10:45 గంటలకు విజయవాడ ఎయిర్‌పోర్టు నుంచి బయలుదేరి 11:25 గంటలకు కర్నూలు ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. అక్కడే ప్రజాప్రతినిధులు, అధికారులతో మాట్లాడుతారు.
- ఉదయం 11:55 గంటలకు సి.క్యాంపు రైతుబజారును సందర్శిస్తారు. సుమారు అరగంట సేపు రైతులతో, శానిటరీ వర్కర్లతో ముఖాముఖి మాట్లాడుతారు.
- 12.30 గంటలకు కేంద్రీయ విద్యాలయం సమీపం వంద అడుగుల రోడ్డులో ఉన్న పార్కులో స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర పార్కును ఏర్పాటు కోసం భూమి పూజ చేస్తారు.
- మధ్యాహ్నం ఒంటి గంటకు కేంద్రీయ విద్యాలయం సమీపంలో ఏర్పాటు చేసిన ప్రజా వేదిక వద్దకు వస్తారు.
- మధ్యాహ్నం 2 గంటల నుంచి 3:30 గంటల వరకు ప్రజలతో ముఖాముఖి చర్చిస్తారు. 3:30 గంటల నుంచి 5:05 గంటల వరకు పార్టీ నాయకులతో సమావేశం ఉంటుంది. అలాగే 5:20 గంటలకు ప్రజా వేదిక నుంచి కర్నూలు ఎయిర్‌పోర్టుకు బయలుదేరి వెళ్తారు.

రైతుబజార్‌కు పూర్వ వైభవం



వైసీపీ హయాంలో కుంటుపడిన అభివృద్ధిని గాడిలో పెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైంది. ఈ నేపథ్యంలో ఉమ్మడి జిల్లా అభివృద్ధే లక్ష్యంగా సీఎం చంద్రబాబు నాయుడు అహర్నిశలు కృషి చేస్తున్నారు. రాష్ట్రంలోనే రైతు బజార్ల నిర్వహణలో మూడో స్థానంలో సి.క్యాంపు రైతుబజార్ ఉంది. 'స్వచ్ఛాంద-స్వర్ణాంధ్ర'లో భాగంగా సి.క్యాంపు రైతుబజార్‌ను పర్యటించేందుకు సీఎం సిద్ధమయ్యారు. రైతుబజారులో సీఎం చంద్రబాబు చేసే తనిఖీలను అంచనావేసి పూర్తి స్థాయిలో ఈకార్యక్రమం విజయవంతం చేసేందుకు రాష్ట్ర, జిల్లా స్థాయి అధికారులు తీవ్రంగా కృషి చేస్తున్నారు. ఈ సందర్భంగా రైతుబజారు, పరిసర ప్రాంతాల్లో జరుగుతున్న పనులను వారు పర్యవేక్షిస్తున్నారు. రోడ్ల వెడల్పు, డ్రైనేజీల మరమ్మతులు, మరుగుదొడ్ల పరిశుభ్రత వంటి పనులు చేపడుతున్నారు. సీఎం రాక సందర్భంగా నగరానికి కొత్త శోభ సంతరించుకుంది. రోడ్ల ప్యాచ్ వర్క్ పనులు చేపట్టారు. డివైడర్లకు రంగులు వేస్తున్నారు.

- చురుగ్గా అభివృద్ధి పనులు
- రోడ్డు వెడల్పునకు శ్రీకారం
- డ్రైనేజీలకు మరమ్మతులు
- పర్యవేక్షిస్తున్న అధికారులు
- రైతులు చెప్పే సమాధానాలపై కసరత్తు
- రైతుబజార్ విస్తరణకు గ్రీన్ సిగ్నల్ లభించేనా?

కర్నూలు అగ్రికల్చర్, మే 15 (ఆంధ్రజ్యోతి): సి.క్యాంపు రైతుబజారుకు పూర్వవైభవం రానుంది. 'స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర'లో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శనివారం సి.క్యాంపు రైతుబజారులో పర్యటించనున్నారు. రైతుబజారును సుందరంగా తీర్చిదిద్దేందుకు కలెక్టర్ రంజిత్ బాషా ఆదేశాల మేరకు జేసీ నవ్య రైతుబజారుతో పాటు పరిసర ప్రాంతాల్లో జరుగుతున్న పనులను పర్యవేక్షించారు. రాష్ట్రంలోనే రైతు బజార్ల నిర్వహణలో మూడోస్థానంలో ఉన్న సి.క్యాంపు రైతుబజార్ ఉంది. ఏవిధంగా ఆస్థాయికి చేరిందో ఉన్నతాధికారుల నుంచి సమాచారాన్ని సీఎం తెలుసుకొని ఈ రైతుబజారును ఏవిధంగా అభివృద్ధి చేశారో, ఎంతమంది రైతులు ఏయే గ్రామాల నుంచి ఇక్కడికి వచ్చి కూరగాయలు అమ్ముకుంటున్నారో ఎంత మంది వినియోగదారులు ప్రతిరోజు ఇక్కడకు వచ్చి కూరగాయలను కొనుగోలు చేస్తున్నారో స్వయంగా పరిశీలించనున్నారు.

పనుల పర్యవేక్షణ

సి.క్యాంపు రైతుబజారులో సీఎం చంద్రబాబు చేసే తనిఖీలను అంచనావేసి పూర్తి స్థాయిలో ఈకార్యక్రమం విజయవంతం చేసేందుకు రైతుబజార్ రాష్ట్ర సీఈవో మాధవీలత, మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ విజయ సునీతతో పాటు కడప జేడీ రామాంజనేయులు రైతుబజారులో చేపట్టాల్సిన, జరుగుతున్న పనులను జేసీ నవ్య గురువారం పర్యవేక్షించారు. పనులను ప్రత్యక్షంగా పరిశీలించి పలు సూచనలు చేశారు. సీఎం తనిఖీలు చేసేందుకు ఎటువంటి ఆటంకాలు, ట్రాఫిక్ రద్దీ లేకుండా రైతుబజారు ముందు ఉన్న రోడ్డును వెడల్పు చేశారు. రైతుబజారులో కాలువలను మరమ్మతులు చేశారు. మరుగుదొడ్లు శుభ్రం చేయించారు. రైతుబజారు ఎస్టేట్ అధికారి కళ్యాణమ్మతో పాటు హార్టికల్చర్ అసిస్టెంట్ శివకుమార్, సెక్యూరిటీ గార్డులను అప్రమత్తం చేశారు. రైతులతో సీఎం చంద్రబాబు ఏమి మాట్లాడుతారో.. ఆయన అడిగే ప్రశ్నలకు రైతులు చెప్పాల్సిన సమాధానాలపై మార్కెటింగ్ శాఖ ఉన్నతాధికారులు కసరత్తు చేశారు.

ముగ్గురు రైతుల ఎంపిక

రైతుబజార్ లక్ష్యం నెరవేరేందుకు అధికారులు చేస్తున్న కృషిని ప్రత్యక్షంగా పరిశీలించిన ముగ్గురు ఆదర్శ రైతులను మార్కెటింగ్ శాఖ ఉన్నతాధికారులు ఎంపిక చేశారు. పోస్టు గ్రాడ్యుయేషన్ చేసి క్రిష్టగిరి మండలం అమకతాడులో తనకున్న పొలంలో పూర్తిస్థాయిలో సేంద్రియ ఎరువులతోనే వివిధ రకాల పంటలను పండిస్తూ సి.క్యాంపు రైతుబజారులో ఉన్నతాధికారుల సహకారంతో స్టాల్‌ను ఏర్పాటుచేసి సేంద్రీయ ఆహారోత్పత్తులను విక్రయిస్తున్న సూర్యప్రకాష్ రెడ్డి ఏ విధంగా ఈస్థాయికి చేరాడో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పరిశీలించేందుకు అవసరమైన ఏర్పాట్లన్నీ ఉన్నతాధికారులు పూర్తి చేశారు. చిన్నటేకూరు చెందిన పరమేష్ సేంద్రియ ఎరువులతో కూరగాయలను సాగు చేస్తూ పండిస్తున్నారు. ఈ రైతుబజారులోనే తాను పండించిన కూరగాయలను ప్రజలకు విక్రయిస్తూ మంచి లాభం పొందుతున్నాడు. పాండురంగడు అనే రైతు ఉల్లితో పాటు ఆకుకూరలను తనకున్న రెండెకరాల పొలంలో సాగుచేసి తక్కువ ధరకే వినియోగదారులకు విక్రయిస్తూ గుర్తింపు పొందాడు. ఈ ముగ్గురు రైతులు ప్రజలకు ఆరోగ్యకరమైన కూరగాయాలను చౌకగా ఎలా అందిస్తున్నారో సీఎం స్వయంగా పరిశీలించనున్నారు.


వైసీపీ హయాంలో..

ప్రతిరోజు కూరగాయలు కొనుగోలు చేసేందుకు స్థానిక ప్రజలు ఆరు, ఏడు వేల మంది దాకా ఈ రైతుబ జారుకు వస్తున్నారు. నడవడానికి కూడా ఇబ్బందికరంగా మారింది. ఈ పరిస్థితుల నుంచి రైతుబజారును గట్టెక్కించేందుకు మార్కెటింగ్ శాఖ అధికారులు వైసీపీ ప్రభుత్వ హయాంలో ఎన్నో ప్రతిపాదనలను పంపినా అప్పట్లో ఎవరూ పట్టించుకోలేదు. రైతుబజారును అనుకుని ఉన్న శిథిలావస్థకు చేరిన పది రెవెన్యూ క్వార్టర్స్‌ను రైతుబజారుకు అప్పగించి విస్తరించేందుకు చర్యలు తీసుకోవాలని దాదాపు రూ.4 కోట్లతో టీడీపీ ప్రభుత్వ హయాంలోనే ప్రతిపాదనలు చేశారు. నిధులు కూడా మంజూర య్యాయి. వైసీపీ ప్రభుత్వం రాకతో ఆనిధులు వెనక్కు వెళ్లాయి. మళ్లీ ప్రస్తుతం ఈ రెవెన్యూ క్వార్టర్స్‌ను కూలగొట్టి అక్కడ సీ.క్యాంపు రైతుబజారును విస్తరించేందుకు మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ విజయసునీతకు అధికారులు ప్రతిపా దనలు పంపారు. సీఎం చంద్రబాబు నాయుడు తన పర్యటనలో సీ.క్యాంపు రైతుబజారు విస్తరణకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చే అవకాశముందని మార్కెటింగ్ శాఖ ఉన్నతాధికారులు చెబుతున్నారు.



సి.క్యాంపు రైతుబజారులో కొనసాగుతున్న పనులు

డెంగీతో తస్మాత్ జాగ్రత్త



- ఆడ ఏడిస్ దోమ కాటుతో వాప్తి
- పరిసరాల్లో నీటి నిల్వలేకుండా చూడాలి
- సరైన అవగాహన లేకపోవడమే కారణం
- సకాలంలో చికిత్సతో నివారణ సాధ్యం
- ఏటేటా పెరుగుతున్న కేసులు
- నేడు జాతీయ డెంగీ నివారణ దినోత్సవం



కర్నూలు హాస్పిటల్, మే 15 (ఆంధ్రజ్యోతి): డెంగీ చాలా వరకు మామూలు జ్వరమే. అయినా కొందరిలో ఇది ప్రాణాంతకంగా పరిణమిస్తోంది. సరైన అవగాహన లేకపోవడమే దీనికి ప్రధాన కారణం. సకాలంలో చికిత్స తీసుకుంటే ఈవ్యాధిని చాలా వరకు నివారించొచ్చు. డెంగీ వ్యాధిని నియంత్రించడానికి ప్రజల్లో అవగాహన కల్పించడానికి ప్రతి సంవత్సరం మే 16వ తేదీన జాతీయ డెంగీ నివారణ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది 'మూడు పద్ధతులను పాటించండి.. డెంగీను ఓడించండి' అన్న నినాదాన్ని ప్రభుత్వం ఇచ్చింది.

వ్యాప్తి: ఈ వైరస్ ఆడ ఏడిస్ రకం దోమకాటు ద్వారా వ్యాప్తి చెందుతుంది. ఈ దోమలు ఇండ్లలోని నీటి నిల్వల్లో పెరుగుతాయి. వైరస్ దోమలు పగటిపూట కుడుతాయి. ఈ దోమలు 400 మీటర్లు ఎక్కువ దూరం ఎగరలేవు.

వ్యాధి లక్షణాలు

డెంగీ తీవ్రమైన జ్వరంతో మొదలవుతుంది. కండ్లు కదిలించలేని పరిస్థితి. ఎముకలు, కండరాల్లో భరించలేని నొప్పి, శరీరంపై పొక్కులు వస్తాయి. అధిక దాహం, నోరు ఎండిపోవడం. ఆకస్మికంగా తీవ్రమైన జ్వరం, తలనొప్పి.

చికిత్స



వైరస్ వల్ల కలిగే ఈ వ్యాధికి పూర్తిచికిత్స లేదు. లక్షణాలు బట్టి వైద్యులచే ఉపశమన చర్యలు చేపట్టాలి. వ్యాధి తీవ్రంగా ఉన్నట్లయితే ప్రభుత్వ సర్వజన, జిల్లా ఆసుపత్రుల్లో వైద్యులను సంప్రదించాలి. పూర్తిగా కోలుకునే వరకు వైద్యుడి పర్యవేక్షణలో ఉండాలి. రక్త నమూనాలను పరీక్షించే వ్యాధి నివారణ ఏలిసా టెస్టు ద్వారా చేయించాలి.

కర్నూలు మున్సిపాలిటీలో అత్యధికంగా..

కర్నూలు నగరంలో అత్యధికంగా 16 డెంగీ కేసులు వెలుగు చూశాయి. ఇందులో శ్రీరాంనగర్‌లో 4, వడ్డేగేరిలో 3, శరీన్‌నగర్‌లో 3 కేసులు బయటపడ్డాయి. ఇక గూడూరు మున్సిపాలిటీలో హరిజనవాడలో 3, ఎమ్మిగనూరు మున్సిపాలిటీలో 4 కేసులు. సి.బెళగల్ మండలంలోని పోలకల్ పీహెచ్‌సీలో అత్యధికంగా ఏడు డెంగీ కేసులు నమోదయ్యాయి. డి.బెళగల్ పీహెచ్‌సీలో 6 కేసులు వచ్చాయి. కల్లూరు, దైవందిన్నె, నన్నూరు, హాలహర్వి (ఎస్), లద్దగిరిలో ఒక్కొక్క పీహెచ్‌సీ ఐదేసీ కేసులు నమోదు అయ్యాయి. గూడూరు మండలంలోని చనుగొండ్లలో 4, కర్నూలు మండలంలోని ఉల్చాలో 2, రేమటలో 2, ఓర్వకల్లు మండలం లొద్దిపల్లెలో 2 కేసులు వచ్చాయి.

అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నాం




జాతీయ డెంగీ నివారణ దినోత్సవం పురస్కరించుకొని శుక్రవారం అన్నీ పీహెచ్‌సీ, అర్బన్ హెల్త్ సెంటర్లలో అంగన్‌వాడీ సెంటర్లు, సచివాలయాలు, ప్రభుత్వ కార్యాలయాల్లో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నాం. ఈ మేరకు డెంగీ వ్యాధికి సంబంధించి ఐఈసీ కరపత్రాలను పంపిణీ చేశాం. డెంగీ పాజిటివ్ వచ్చిన ఇంటితో పాటు చుట్టుపక్కన ఉన్న 50 ఇళ్లను ఫైరీథ్రం స్ప్రే చేస్తాం.

- డా.పి.శాంతికళ, డీఎంహెచ్‌వో, కర్నూలు

నివారణ చర్యలు

ఇంటి లోపల, ఆవరణంలో నీటి నిల్వలు లేకుండా చూడాలి. ఇంటిలో నీరు నిల్వ ఉన్న పాత్రలపై మూతలు పెట్టాలి. వారానికి ఒక్కసారి ప్రతి శుక్రవారం డ్రైడే - ఫ్రైడే పాటించాలి. ఆరోజు పాత్రలోని నీరు ఉన్నా పారదోసి, పాత్రలను శుభ్రంగా తుడిచిపెట్టుకోవాలి. దోమలు కుట్టకుండా దోమతెరలు వాడాలి.తాగి వదిలేసిన కొబ్బరి బోండాలు, పాతటైర్లు, ఖాళీ డబ్బాలు, పనికిరాని ప్లాస్టిక్ వస్తువులు ఇంటి పరిసరాల్లో ఉంచకుండా చూడాలి.



జిల్లాలో 104 డెంగీ కేసులు

జిల్లాలో డెంగీ కేసులు ఏటేటా పెరుగుతున్నాయి. ఈ ఏడాది జనవరి నుంచి మే 15వ తేదీ వరకు 105 డెంగీ పాజిటివ్ కేసులు వెలుగుచూశాయి. జిల్లా వ్యాప్తంగా 882 మంది అనుమానితులకు డెంగీ నిర్ధారణ పరీక్షలు చేశారు. ఇందులో ఆదోని, కర్నూలు జీజీహెచ్ మైక్రోబయాలజీ విభాగంలో ఏలిసా టెస్టులు 519 మంది నిర్వహించగా ఇందులో 104 మందికి వ్యాధి ఉన్నట్లు నిర్ధారణ అయింది.

దోమలు కుట్టకుండా చూసుకుంటే..



దోమలు కుట్టకుండా చూసుకుంటే డెంగీని పూర్తిగా నివారించొచ్చు. జిల్లాలో ఆదోని, కర్నూలు జీజీహెచ్‌లలో డెంగీ ఏలిసా టెస్టులు అందుబాటులో ఉన్నాయి. డెంగీ పాజిటివ్‌ను ఏలిసా టెస్టు ద్వారానే నిర్ధారిస్తారు. ఒక గ్రామాల్లోని ఎంఎల్‌హెచ్‌పీలకు డెంగీ కిట్లను కూడా ఇచ్చాం. గ్రామాల్లో డెంగీ పాజిటివ్‌గా వస్తే అయితే కేసును మళ్లీ ఏలిసా టెస్టు చేయించి నిర్ధారణ చేస్తాం. ఈఏడాది 519 ఏలిసా టెస్టులను కర్నూలు, ఆదోనిలోని మైక్రోబయాలజీ విభాగంలో చేయించాలి.

- ఎ.నూకరాజు, జిల్లా మలేరియా అధికారి, కర్నూలు

ప్లేట్‌లెట్లు అందిరికీ అవసరం లేదు



డెంగీ జ్వరంలో అందరికీ ప్లేట్‌లెట్లు ఎక్కించాల్సిన అవసరం లేదు. ప్లేట్‌లెట్ల సంఖ్య లక్ష కన్నా తగ్గినప్పుడు డాక్టర్ల పర్యవేక్షణలో ఉండాలి. ప్లేట్‌లెట్లు 50వేల కన్నా పడిపోతే ఆసుపత్రిలో చేర్చాలి. వీరిని నిశితంగా పరిశీలిస్తుండాలి. ఒకవేళ ప్లేట్‌లెట్లు 20వేల కన్నా తగ్గి, రక్తస్రావ లక్షణాలు కనిపిస్తుంటే బయటి నుంచి ప్లేట్‌లెట్లు ఎక్కించాల్సి వస్తుంది. అదే 10వేలకు పడిపోతే రక్తస్రావం ఉన్నా లేకున్నా ప్లేట్‌లెట్లు ఎక్కించాలి.

- డా.పి.రవికళాధర్ రెడ్డి, సీనియర్ ఫిజీషియన్, కర్నూలు

పరిస్థితిని బట్టి చికిత్స



ఒక మాదిరి డెంగీ జ్వరానికి పారాసిటమాల్ మాత్రలు ఇస్తే సరిపోతుంది. వాంతులు లేకపోతే ఓఆర్ఎస్ఎస్ ద్రావణం తాగించాలి. వాంతులు అవుతుంటే వాటిని తగ్గించే మందులతో పాటు ఓఆర్ఎస్ ఇవ్వాలి. ముఖ్యంగా పిల్లలను ఆసుపత్రిలో చేర్చి చికిత్స అందించాలి.

- డా. వినీషా రెడ్డి, సీనియర్ ఫిజీషియన్, వీఆర్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్, కర్నూలు

మాకు రాజకీయ గురువు ఎన్టీఆర్

- శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు
- మంత్రి ఫరూక్ పుట్టిన రోజు వేడుకల్లో పాల్గొన్న ప్రజాప్రతినిధులు



కేక్ కట్ చేస్తున్న మంత్రి ఎన్ఎండీ ఫరూక్

నంద్యాల రూరల్, మే 15 (ఆంధ్రజ్యోతి): నాకు, ఫరూక్‌కు రాజకీయ గురువు ఎన్టీఆర్ అని శాసనసభ స్పీకర్ అయన్నపాత్రుడు అన్నారు. గురువారం నంద్యాలలోని ఆర్ అండ్ బీ అతిథిగృహంలో ఆయన పుట్టిన రోజు వేడుకలు నిర్వహించారు. ఇందులో స్పీకర్ అయ్యన్నపాత్రుడు, ఎంపీ బైరెడ్డి శబరి, మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి, మాజీ మంత్రి ఏరాసు ప్రతాపరెడ్డి పాల్గొని కేక్ కోసి సంబరాలు జరుపుకొన్నారు. అనంతరం రాజ్ టాకీస్ వద్ద ఉన్న టీడీపీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. స్పీకర్ మాట్లాడుతూ ఎన్టీఆర్ ఆశీస్సులతో చిన్న వయస్సులోనే మంత్రి పదవులు చేశామన్నారు. పుట్టిన రోజు ఉందని తెలుసుకుని ఒక రోజు ముందుగానే ఇక్కడికి వచ్చామన్నారు. ఆయనకు మంచి ఆరోగ్యంగా ఉండాలన్నారు. ఈ వయస్సులో కూడా ప్రజలకు సేవ చేయాలనే సంకల్పంతో నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండడం విశేషం అన్నారు. అనంతరం కార్యకర్తలతో పలు సమస్యలపై చర్చించారు. నంద్యాల అభివృద్ధికి సహకరిస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పచ్చిరొట్ట.. దిగుబడిలో దిట్ట

- జిల్లాకు 3,047 క్వింటాళ్ల జీలుగ, పిల్లిపెసర, జనము విత్తనాలు మంజూరు
- 50 శాతం రాయితీతో పంపిణీ
- నేటి నుంచి రైతు సేవా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ ప్రారంభం



నంద్యాల ఎడ్యుకేషన్, మే 15 (ఆంధ్రజ్యోతి): పంటకు సరైన పోషకాలు లభ్యమైనప్పుడే దిగుబడులు పెరుగుతాయి. అధిక దిగుబడులు పొందాలన్న ఆతృతతో రైతులు పంటలసాగులో విచ్చలవిడిగా రసాయన ఎరువులను వాడడంతో భూసారం దెబ్బతినడమే కాకుండా ఆహార పంటలు కలుషితం అవుతున్నాయి. క్రమంగా పంటల్లో సూక్ష్మ, స్థూల పోషకాలు లోపిస్తున్నాయి. అంతేకాకుండా చీడపీడల ఉధృతి పెరగడంతో రైతులకు పెట్టుబడుల భారం కూడా పెరుగుతోంది. వీటన్నింటినీ అధిగమించాలంటే మనకున్న అన్ని వనరుల్లో తక్కువ ఖర్చు, తక్కువ సమయంలో భూమి సారం పెంపొందించడానికి తద్వారా పంటల ఉత్పాదకత సాధించడానికి పచ్చిరొట్ట పంటలు రైతుకు తోడ్పాటు నందిస్తాయి. జీలుగ, పిల్లిపెసర, జనుము వంటి పంటలు సాగుచేసి పచ్చిరొట్టగా మార్చి పొలాన్ని సారవంతం చేసుకుని పంటల్లో అధిక దిగుబడి సాధించవచ్చని వ్యవసాయాధికారులు రైతులకు సూచిస్తున్నారు.

జిల్లాకు 3,047 క్వింటాళ్ల విత్తనాలు కేటాయింపు

పంటల్లో దిగుబడి పెంచి రైతుకు అండగా ఉండేందుకు ప్రభుత్వం జిల్లాకు 3047 క్వింటాళ్లు కేటాయించింది. రైతులకు క్వింటాకు 50శాతం రాయితీతో సమీప రైతు సేవా కేంద్రాల నుంచే రైతులకు పచ్చిరొట్ట విత్తనాలను అందజేస్తున్నారు. విత్తనాలు కావాల్సిన రైతులు ముందుగా ఆర్ఎస్‌కేలలో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి. రైతులు పొలం పాస్‌బుక్, ఆధార్‌కార్డు జిరాక్స్‌లతో వెళ్లి రిజిస్ట్రేషన్ చేసుకోవాలి.

పచ్చిరొట్ట మంచి పోషకాలను ఇస్తుంది



పచ్చిరొట్ట భూములకు మంచి పోషకాలను అందిస్తుంది. పంటలకు మేలుచేసే సూక్ష్మ జీవులను వృద్ధి చేయడంతో పాటు జీవ రసాయనిక చర్యలతో నేలసారం పెరుగుతుంది. సూక్ష్మజీవులు ఉత్పత్తి చేసే హార్మోన్ల వల్ల మొక్కల పెరుగుదల వృద్ధి చెందుతుంది. అన్ని రైతు సేవా కేంద్రాల్లో రైతులు రిజిస్ట్రేషన్ చేయించుకుని, 50శాతం సబ్సిడీతో విత్తనాలను పొందవచ్చు.

- మురళీకృష్ణ, జిల్లా వ్యవసాయాధికారి, నంద్యాల

చౌడు భూముల్లో జీలుగ మేలు

క్షారగుణం కలిగిన చౌడుభూములతో పాటు వరి పండించే భూముల్లో ఎక్కువగా జీలుగ వేసుకోవచ్చు. ఎకరాకు 10 కిలోల నుంచి 15కిలోల వరకు విత్తనాలను ఇసుకలో కలిపి చల్లడంతో పొలానికంతా సమానంగా పడుతుంది. జీలుగ పూతదశలో ఉన్నప్పుడు భూమిలో కలియదున్నడం వల్ల ఎకరాకు 9నుంచి 10టన్నుల పచ్చిరొట్ట లభిస్తుంది. చౌడు భూములను మామూలు భూములుగా తీసుకు రావడానికి జీలుగ పచ్చిరొట్ట బాగా ఉపయోగపడుతుంది. ఇందులో 3.5శాతం నత్రజని (పాయింట్).5శాతం భాస్వరం, 1.2 శాతం పొటాష్ లభిస్తుంది.

జీలుగ విత్తనాలు కేటాయింపు ఇలా..

జీలుగ విత్తనాలను ఆళ్లగడ్డ మండలానికి 215 క్వింటాళ్లు, ఆత్మకూరు 47 క్వింటాళ్లు, బనగానపల్లె 109.5, బండిఆత్మకూరు 574.3, దొర్నిపాడు 2.9, గోస్పాడు 100, జూపాడుబంగ్లా 24.4, కోవెలకుంట్ల 21.5, మహానంది 330, మిడ్తూరు 4.4, నంద్యాల 330, పగిడ్యాల 6.9, పాములపాడు 100, పాణ్యం 67, రుద్రవరం 311.3, శిరువెళ్ల 586.4, వెలుగోడు 185 క్వింటాళ్లు కేటాయించారు.

తేలికైన, బరువైన నేలల్లో పిల్లిపెసర మేలు

తేలికైన, బరువైన నేలల్లో సాగుచేయవచ్చు. చౌడుభూముల్లో సాగు పనికిరాదు. ఎకరాకు 6 నుంచి 8 కిలోల విత్తనం వేయడం వల్ల 3 నుంచి 4 టన్నుల పచ్చిరొట్ట లభిస్తుంది. ఇందులో (పాయింట్).7 నత్రజని, .18 భాస్వరం, 1.5 పొటాష్ లభిస్తుంది.

పిల్లిపెసర ఐదు మండలాలకు కేటాయింపు

పిల్లిపెసర విత్తనాలను బనగానపల్లె మండలానికి ఒక క్వింటా, బండిఆత్మకూరు మండలానికి ఐదు క్వింటాళ్లు, మహానంది మండలానికి ఐదు క్వింటాళ్లు, నంద్యాల మండలానికి నాలుగు క్వింటాళ్లు, పాణ్యం మండలానికి 4 క్వింటాళ్లు కేటాయించారు.

రెండు మండలాలకు జనుము విత్తనాలు

ఎకరాకు 15 కేజీల జనుము విత్తనాలు వేయాలి. పంట పూతదశ వరకు పెంచి భూమిలో కలియదున్నాలి. ఇందులో 2.3శాతం నత్రజని, (పాయింట్).5 శాతం భాస్వరం, 1.8 శాతం పొటాష్ లభిస్తుంది. సంజామల మండలానికి 2.9 క్వింటాళ్లు, శిరివెళ్ల మండలానికి 2 క్వింటాళ్లు కేటాయించారు.

భారత సైన్యానికి ప్రపంచంలోనే ప్రత్యేక గుర్తింపు

- రచయిత, నటుడు శంకర్ రాజు



కళాకారులను సన్మానించి జ్ఞాపికలు అందజేసిన ప్రముఖులు



'బావ ఎప్పుడు వచ్చితీవి' నాటకంలోని ఓ దృశ్యం

కర్నూలు కల్చరల్, మే 15 (ఆంధ్రజ్యోతి): ఉగ్రవాదుల దాడిని సమర్థవంతంగా తిప్పికొట్టడంతో భారత సైన్యానికి ప్రపంచంలోనే ఒక గుర్తింపు వచ్చిందని పౌరాణిక రంగ స్థల నటుడు షణ్ముఖి ఆంజనేయరాజు అల్లుడు హైదరాబాద్‌కు చెందిన నాటక రచయిత, నటుడు మందిరాజు శంకర్‌రాజు అన్నారు. నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో నిర్వహిస్తున్న జై జవాన్ కల్చరల్ ఫెస్ట్ కార్యక్రమం ఆరో రోజు గురువారం నిర్వహించిన కార్యక్రమాలకు శంకర్‌రాజు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాలను ప్రారంభించారు. అనంతరం భరతమాత చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన దేశభక్తి నృత్యాలను గీతాలను ఆలపించిన కళాకారులను సత్కరించి మాట్లాడుతూ భారత సైన్యానికి మనందరం ఎల్లవేళలా రుణపడి ఉంటామన్నారు. సైన్యం త్యాగాలను కొనియాడాల్సిన అవసరం ఉందన్నారు. కళాక్షేత్ర అధ్యక్షుడు పత్తి ఓబులయ్య మాట్లాడుతూ గత ఆరు రోజుల నుంచి భారత్ మాతాకి జై అనే నినాదంతో ఆడిటోరియం మార్మోగి పోయిందన్నారు. రాష్ట్రంలో మొదటి సారి ఒక కళా సంస్థ వారం రోజుల పాటు జై జవాన్ పేరుతో వేడుకలను నిర్వహించిందన్నారు. కార్యక్రమంలో కేవీ రమణ, బాల వెంకటేశ్వర్లు, రంగస్థల కళాకారులు వీవీ రమణారెడ్డి, పి.దస్తగిరి, హనుమంతరావు చౌదరి, మహ్మద్ మియా, ఇనాయతుల్లా, యాగంటీశ్వరప్ప, సీవీ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నవ్వించిన 'బావ ఎప్పుడు వచ్చితీవి' నాటిక: జై జవాన్ కల్చరల్ ఫెస్ట్‌లో భాగంగా గురువారం రాత్రి ప్రదర్శించిన 'బావ ఎప్పుడు వచ్చితీవి' సాంఘిక హాస్య నాటిక అసాంతం ప్రేక్షకులను నవ్వించింది. టీజీవీ కళాక్షేత్రం కళాకారుడు సంగా ఆంజనేయులు దర్శకత్వంలో ప్రదర్శించారు. మహిళలపై చిన్నచూపు తగదంటూ కళాకారులు మహ్మద్ మియా, సంగా ఆంజనేయులు, భాస్కర్, చల్లా నవీన్ కుమార్ చౌదరి, రేణుక చూపిన ప్రదర్శన ఆలోచింపజేసింది.



నృత్యం చేస్తున్న కళాకారులు

డిగ్రీ సెమిస్టర్ ఫలితాలు విడుదల

కర్నూలు అర్బన్, మే 15(ఆంధ్రజ్యోతి): సిల్వర్ జూబ్లీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 6వ సెమిస్టర్ ఫలితాలను క్లస్టర్ యూనివర్శిటీ రిజిస్ట్రార్ కట్టా వెంకటేశ్వర్లు గురువారం విడుదల చేశారు. 2022-25 బ్యాచ్ చివరి సంవత్సరం విద్యార్థులకు ఏప్రిల్‌లో పరీక్షలు నిర్వహించామని, 216 మంది పరీక్షలు రాయగా 216 మంది ఉత్తీర్ణత సాధించారన్నారు. వందశాతం ఉత్తీర్ణత సాధించడంతో అధ్యాపకులను అభినందించారు.

స్పీకర్‌ను కలిసిన కలెక్టర్ రాజకుమారి


స్పీకర్‌కు మొక్క ఇస్తున్న కలెక్టర్

నంద్యాల నూనెపల్లె, మే 15 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్ అయ్యన్న పాత్రుడుని నంద్యాల కలెక్టర్ రాజకుమారి మర్యాదపూర్వకంగా కలిశారు. గురువారం నంద్యాలకు వచ్చిన అయ్యన్న పాత్రుడు రోడ్లు భవనాల అతిథి గృహంలో ఉండగా కలెక్టర్ రాజకుమారి కలిసి పూల మొక్కను అందజేశారు. నంద్యాల జిల్లా సమగ్ర అభివృద్ధిపై వారు చర్చించారు.

ఇంటర్ పరీక్షల్లో ఒకరి డిబార్

కర్నూలు ఎడ్యుకేషన్, మే 15 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ సప్లిమెంటరీ మొదటి సంవత్సరం పరీక్షల్లో మాల్‌ప్రాక్టీసుకు పాల్పడిన ఓ విద్యార్థిని గురువారం డిబార్ చేసినట్లు ఆర్‌ఐవో గురువయ్యశెట్టి తెలిపారు. ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం పరీక్షలకు మొత్తం 491 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షకు 9380 మంది నమోదు చేసుకోగా, 8963 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా, ఇందులో 417 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ద్వితీయ సంవత్సరం పరీక్షకు 1277 మంది నమోదు చేసుకోగా, 1203 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా, 74 మంది గైర్హాజరయ్యారు. బీ.క్యాంపు ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కళాశాల పరీక్షా కేంద్రంలో మాల్‌ప్రాక్టీసుకు పాల్పడిన ఓ విద్యార్థిని డిబార్ చేశామన్నారు. పరీక్షా కేంద్రాలను డీవీఈవో సురేష్‌బాబు, జిల్లా డీఈసీ సభ్యులు, ఫ్లయింగ్, సిట్టింగ్ స్క్వాడ్ సభ్యులు పర్యవేక్షించారు.

విధుల్లో చేరిన ఎస్పీ

కర్నూలు క్రైం, మే 15 (ఆంధ్రజ్యోతి): ఎస్పీ విక్రాంత్ పాటిల్ గురువారం తిరిగి విధుల్లో చేరారు. ఈ నెల 4వ తేదీ నుంచి ఎస్పీ వ్యక్తిగత సెలవులపై కుటుంబ సభ్యులతో కలిసి జపాన్‌కు వెళ్లారు. తిరిగి గురువారం విధుల్లో చేరారు. అనంతరం ముఖ్యమంత్రి జిల్లా పర్యటన సందర్భంగా బందోబస్తు ఏర్పాట్లపైన సి.క్యాంపు, కేంద్రీయ విద్యాలయం, ధనలక్ష్మి, పార్కు, ఓర్వకల్లు ఎయిర్‌పోర్టు ప్రాంతాల్లో పర్యటించారు. అనంతరం పోలీసు అధికారులతో బందోబస్తు ఏర్పాట్లపై పలు సూచనలు చేశారు.

భూగర్భ జలాల నిల్వకు చర్యలు

- జూన్ ఆఖరుకు 8,500 కుంటలను పూర్తి చేయడమే లక్ష్యం
- జిల్లా నీటి యాజమాన్య సంస్థ పీడీ వెంకటరమణయ్య

కర్నూలు అగ్రికల్చర్, మే 15 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో భూగర్భ జలాలను పెద్దఎత్తున నిల్వచేసేందు కోసం అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని, ఇందులో భాగంగా 8500 పంటకుంటలు జూన్ నెలాఖరులోగా నిర్మిస్తున్నట్లు జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ వెంకటరమణయ్య గురువారం తెలిపారు. రైతులు తమ పొలాల్లో వీటిని తవ్వకుంటే వర్షం నీరంతా పంటకుంటల్లో నిల్వ ఉండి వర్షాభావ పరిస్థితులు నెలకొన్నప్పుడు ఈ నీటిని పంటలకు వినియోగించుకునే అవకాశం ఉంటుందని చెప్పారు. పంటకుంటల ఏర్పాటు కోసం ఇప్పటికి 7వేల మంది రైతులను గుర్తించామని, వీరి పొలాల్లో 2,500 పంటల గుంటల పనులు జరుగుతున్నాయని తెలిపారు. వీటిలో 800 దాకా పూర్తి చేశామని, 1600 పురోగతిలో ఉన్నాయన్నారు. వీటి తవ్వకం కోసం ఉపాధి కూలీలకు 12లక్షల పనిదినాలు కల్పిస్తామని, రూ.36.84 కోట్లు ఖర్చు చేయనున్నట్లు అధికారి వెల్లడించారు.

బలిజ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు


మాట్లాడుతున్న నగర బలిజ సంఘం అధ్యక్షుడు లక్ష్మన్న

కర్నూలు కల్చరల్, మే 15(ఆంధ్రజ్యోతి): ఈ విద్యాసంవత్సరం 'పది', ఇంటర్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన జిల్లా బలిజ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేయనున్నట్లు నగర బలిజ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు గాండ్ల లక్ష్మన్న, మండ్లెం రవికుమార్ తెలిపారు. గురువారం నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ప్రతిభా పురస్కారాలు వివరాలు తెలిపే బ్రోచర్లను వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గాండ్ల లక్ష్మన్న మాట్లాడుతూ పదో తరగతిలో 550 మార్కులు, ఇంటర్‌లో 950 మార్కులు సాధించిన విద్యార్థులు తమ మార్కుల జాబితా, ట్రాన్స్‌ఫర్ సర్టిఫికెట్, చిరునామా, ఫోన్ నెంబర్‌ను 9000009440 నెంబరుకు వాట్సాప్ ద్వారా ఈ నెల 22వ తేదీలోపు పంపి తమ పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. ఈనెల 25వ తేదీ ప్రతిభ పురస్కారాల ప్రధాన కార్యక్రమం కర్నూలు టీజీవీ కళాక్షేత్రంలో ఉంటుందన్నారు. పదో తరగతి, ఇంటర్‌లో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు వరుసగా రూ.5వేలు, రూ.3వేలు, 2 వేలు నగదు బహుమతులు అందజేస్తామని, మెరిట్ విద్యార్థులందరికీ జ్ఞాపిక, ప్రతిభ పురస్కార పత్రం ఇవ్వనున్నామని తెలిపారు. ప్రతిభ పురస్కారాల ప్రధాన కార్యక్రమానికి విద్యార్థులు వారి తల్లిదండ్రులతో పాటు హాజరు కావాల్సిందిగా విజ్ఞప్తిచేశారు. సమావేశంలో సంఘం గౌరవాధ్యక్షులు పత్తి ఓబులయ్య, ప్రధాన సలహాదారుడు డా.సింగంశెట్టి సోమశేఖర్, సహాయ కార్యదర్శి ప్రకాష్‌బాబు, రాయల మహిళా సంఘం అధ్యక్షురాలు అలుపూరి సుజాత పాల్గొన్నారు.

రైలుకింద పడి వ్యక్తి ఆత్మహత్య

వెల్దుర్తి, మే 15(ఆంధ్రజ్యోతి): రైలు కింద పడి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన వెల్దుర్తిలో చోటుచేసుకుంది. నంద్యాల జిల్లా బనగానపల్లె మండలం పలుకూరు గ్రామానికి చెందిన దూదేకుల చిన్నబాబు(42) బొమ్మిరెడ్డిపల్లెలో కూతురు వద్ద ఉంటున్నారు. అయితే అనారోగ్యంతో బాధపడుతున్నారు. బుధవారం రాత్రి ఇంటిలో నుంచి వెళ్లిన వ్యక్తి గురువారం ఉదయం రైలు పట్టాలపై విగత జీవిగా కనిపించారు. స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న రైల్వే జీఆర్‌పీ, ఆర్‌పీఎఫ్ ఏఎస్‌ఐలు ప్రేమ్‌కుమార్, రమేశ్ ఘటనా స్థలానికి చేరుకొని విచారించారు. కేసు నమోదు చేసుకున్నారు. కర్నూలు సర్వజనవైద్యశాలలో పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు. హెడ్ కానిస్టేబుల్ మాధవస్వామి, సిబ్బంది ఉన్నారు.

పిడుగుపాటుకు వ్యక్తి మృతి

చాగలమర్రి, మే 15 (ఆంధ్రజ్యోతి): పిడుగుపాటుకు ఓ వ్యక్తి మృతిచెందినట్లు ఎస్‌ఐ సురేష్‌బాబు తెలిపారు. వివరాలు.. మండలంలోని తిప్పనపల్లె గ్రామ సమీపంలో గురువారం తెల్లవారుజామున పిడుగు పాటుకు గురై చంద్రశేఖర్ (24) అనే వ్యక్తి మృతిచెందాడు. కడప జిల్లా తొండూరు మండలం కొరవానిపల్లె గ్రామానికి చెందిన చంద్రశేఖర్‌తో పాటు మరో ఐదుగురు గొర్రెలు మేపుకునేందుకు వచ్చారు. ఆయా పొలాల్లో రాత్రి వేళలో నివాసం ఉంటున్నారు. ఉరుములు, మెరుపు లతో కూడిన వర్షంతో పాటు ఒక్కసారిగా పిడుగు పడింది. సమీపంలో ఉన్న శేఖర్ ఆ శబ్దానికి అస్వస్థతకు గురై అక్కడికక్కడే మృతిచెందాడు. తోటి కాపరులు కూడా భయాందోళనకు గురయ్యారు. పోలీసులు, రెవెన్యూ సిబ్బంది చేరుకుని, సంఘటన గురించి ఆరాతీశారు. ఎస్‌ఐ సురేష్‌బాబు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆళ్లగడ్డ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

కేంద్రం నియంత్రణలోకి ఉపాధి

- యుక్తధార యాప్ అమలులోకి
- ప్రతి పనిని నమోదు చేయాలని ఆదేశాలు
- పనులు, చెల్లింపులు అన్నీ ఢిల్లీ నుంచే


ఉపాధి పనులు చేస్తున్న కూలీలు (ఫైల్)

కర్నూలు అగ్రికల్చర్, మే 15(ఆంధ్రజ్యోతి): ఇప్పటి వరకు రాష్ట్ర ప్రభుత్వ ఆజమాయిషీలో ఉపాధి హామీ పనులు సాగాయి. ఇక నుంచి కేంద్ర ప్రభుత్వం అన్ని స్థాయిల్లోనూ తమ ఆధీనంలో ఉండేలా చర్యలు చేపట్టింది. రాష్ట్ర ప్రభుత్వ పాత్ర ఇక నామమాత్రంగానే ఉండబోతోందని ఈ పథకాన్ని అమలు చేస్తున్న నీటి యజమాన్య సంస్థ అధికారులు స్పష్టం చేస్తున్నారు. ఉపాధి హామీ పథకాన్ని పూర్తిగా తన నియంత్రణలోకి తీసుకునేందుకు కేంద్రం 'యుక్తధార' అనే యాప్‌ను రూపొందించింది. గ్రామీణ ప్రాంతాల్లో కూలీలకు పనులు కల్పించేందుకు 2005లో ఉపాధి హామీ పథకాన్ని ప్రవేశపెట్టింది. ఫీల్డ్, టెక్నికల్ అసిస్టెంట్ల ద్వారా పనులు కల్పించేలా చేసింది. ఏపీవో, ఎంపీడీవోలు పర్యవేక్షించేవారు. పనుల కల్పన, బిల్లుల చెల్లింపులు అన్నీ రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలోనే కొనసాగేవి. కేంద్ర ప్రభుత్వం కొత్తగా తీసుకువచ్చిన 'యుక్తధార' యాప్ ద్వారా ఇప్పటి దాకా ఈ పథకంలో జరుగుతున్న ప్రాసెస్ కనుమరుగయ్యే అవకాశముంది.

యాప్ అమలు తీరు ఇలా..

కేంద్ర ప్రభుత్వం 'యుక్తధార' యాప్‌ను తీసుకువచ్చింది. ఎక్కడ ఎలాంటి పనులు జరుగుతున్నాయో ఏప్రాంతంలో ఏ పని ఎప్పుడు చేయాలో అంచనాలు ఎలా వేయాలి, బిల్లుల చెల్లింపులు ఎలా జరగాలనే అంశాలన్నింటినీ ఈ యాప్ ద్వారా ఢిల్లీలో కూర్చుని కేంద్ర ప్రభుత్వ అధికారులు నిర్ణయించనున్నారు. ఆర్థిక సంవత్సరం మొత్తానికి అవసరమైన లేబర్ బడ్జెట్ ఆమోదం తెలుపుతుంది. కూలీలు చేయాల్సిన పనులన్నీ కేంద్రమే గుర్తిస్తుంది. వారికి డబ్బులు నేరుగా కేంద్రమే వారి అకౌంట్లకు జమ చేస్తుంది. ఇప్పటికే 'యుక్తధారయాప్ వినియోగంలో ఉందని, తొలి దశగా జిల్లా వ్యాప్తంగా మండలానికో గ్రామాన్ని పైలట్ ప్రాజెక్టుగా తీసు కుని అమలు చేస్తున్నట్లు కర్నూలు నీటి యజమాన్య సంస్థ పీడీ వెంకటరమణ తెలిపారు. రెండో దశలో జిల్లాలోని అన్ని గ్రామాల్లోనూ అమలు చేయనున్నట్లు ఆయన స్పష్టం చేశారు.

శాసనసభ స్పీకర్‌కు ఘన స్వాగతం

- ఎయిర్‌పోర్ట్ నుంచి ప్రత్యేక వాహనంలో నంద్యాలకు..


అయ్యన్నపాత్రుడుకి పుష్పగుచ్ఛం ఇస్తున్న కలెక్టర్ రంజిత్ బాషా, ఎమ్మెల్యే గౌరు చరిత, మల్లెల రాజశేఖర్

ఓర్వకల్లు, మే 15 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లా పర్యటనలో భాగంగా గురువారం ఓర్వకల్లు విమానాశ్రయానికి ప్రత్యేక విమానంలో రాష్ట్ర శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు చేరుకున్నారు. స్పీకర్‌కు కర్నూలు కలెక్టర్ రంజిత్ బాషా పుష్పగుచ్ఛం అందజేశారు. అలాగే ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి, నంద్యాల టీడీపీ జిల్లా అధ్యక్షుడు, టీటీడీ బోర్డు సభ్యులు మల్లెల రాజశేఖర్ సైతం పుష్పగుచ్ఛం అందజేశారు.

పలు అంశాలపై ప్రజాప్రతినిధులతో స్పీకర్ చర్చిం చారు. స్పీకర్‌కు ఎయిర్‌పోర్టు డైరెక్టర్ విద్యాసాగర్, తహసీల్దార్ విద్యాసాగర్ స్వాగతం పలికారు. ఎస్‌ఐ సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. అనంతరం ఎయిర్‌పోర్టు నుంచి ప్రత్యేక వాహనంలో నంద్యాలకు బయలుదేరి వెళ్లారు.

చికిత్స పొందుతూ ఎస్‌ఐ మృతి

కర్నూలు క్రైం, మే 15 (ఆంధ్రజ్యోతి): అగ్ని ప్రమాదంలో గాయపడిన ఎస్‌ఐ మాసన్న ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. 1989 బ్యాచ్‌కు చెందిన ఈయన పోలీసు శాఖలో కానిస్టేబుల్‌గా విధుల్లో చేరారు. ప్రస్తుతం సీసీఎస్ విభాగంలో ఎస్‌ఐగా పని చేస్తున్నారు. ఈ నెల 5వ తేదీన కర్నూలు నగరం లోని ఇంట్లో అగ్ని ప్రమాదం జరగ్గా తీవ్రంగా గాయపడ్డారు. చికిత్స నిమిత్తం ఆసుపత్రిలో చేర్పించగా.. కోలుకోలేక మృతి చెందా రు. మాసన్నకు భార్య, ఇద్దరు కొడుకులు, కూతురు ఉన్నారు.

విజిలెన్స్ దాడులు

- 58 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం

కర్నూలు క్రైం, మే 15 (ఆంధ్రజ్యోతి): నగరంలోని సంతోష్‌నగర్ వద్ద ఉన్న మల్లికార్జున రైస్‌మిల్లులో విజిలెన్స్ అధికారులు గురువారం రాత్రి దాడులు నిర్వహించారు. రైస్ మిల్లులో అక్రమంగా నిల్వ ఉంచిన 58 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. డీసీటీవో వెంకటరమణ, ఎస్‌ఐ నరేంద్ర భూపతి, తమ సిబ్బందితో దాడులు చేసి ఈరేషన్ బియ్యాన్ని సీజ్ చేశారు. వీటిని సివిల్ సప్లైస్ అధికారులకు అప్పగించారు. మిల్లు యజమాని శ్రీనివాసరావుపై నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్‌లో పిర్యాదు చేశారు. విజిలెన్స్ అధికారుల పిర్యాదు మేరకు నాలుగో పట్టణ ఎస్‌ఐ చంద్రశేఖర్ రెడ్డి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో ఏడుగురికి జరిమానా

కర్నూలు క్రైం, మే 15 (ఆంధ్రజ్యోతి): డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన ఏడుగురికి కోర్టు జరిమానా విధించింది. గత రెండు రోజులుగా ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో నిర్వహిం చిన డ్రంకెన్ డ్రైవ్‌లో ఏడుగురు పట్టుబడ్డారు. పట్టుబడిన ఏడుగురు మందుబాబులను గురువారం కోర్టులో హాజరు పరిచారు. కోర్టు వీరికి ఒక్కొక్కరికి రూ.10వేల చొప్పున జరి మానా విధించిందని ట్రాఫిక్ సీఐ మన్సూరుద్దీన్ తెలిపారు.

ఆర్టీసీ బస్సు, లారీ ఢీ

- నలుగురికి తీవ్ర గాయాలు

ఓర్వకల్లు, మే 15 (ఆంధ్రజ్యోతి): కర్నూలు-చిత్తూరు జాతీయ రహదారి-40పై గురువారం పూడిచర్ల బస్ స్టేజీ వద్ద జరిగిన ప్రమాదంలోనలుగురు ప్రయాణీకులకు తీవ్రగాయాలయ్యాయి. ఆళ్లగడ్డ డిపో చెందిన ఆర్టీసీ బస్సు కర్నూలు వెళ్తాండగా.. ముందు భాగంలో వెళ్తున్న లారీ సడెన్ బ్రేక్ వేయడంతో బస్సు ముందు భాగం లారీనీ ఢీకొనడంతో బస్సులో ఉన్న జ్యోష్న, నిర్మల, వసంత కుమారి, ధర్మతేజకు గాయాలు కాగా, చికిత్స నిమ్మితం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సీఎం పర్యటనను విజయవంతం చేయాలి

- ఎమ్మెల్యేలు, టీడీపీ నాయకుల పిలుపు
- ప్రజా వేదిక ఏర్పాట్ల పరిశీలన


ఏర్పాట్లను పరిశీలిస్తున్న గౌరు దంపతులు, టీడీపీ నాయకులు

కల్లూరు, మే 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్రాభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా ఒక విజన్‌తో కష్టపడి పనిచేస్తున్న సీఎం చంద్రబాబు నాయుడు పర్యటనను విజయవంతం చేయాలని పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరిత అన్నారు. ఈనెల 17న కర్నూలు జిల్లా పర్యటనకు విచ్చేయుచున్న నేపథ్యంలో కేంద్రీయ విద్యాలయ సమీపంలో గురువారం టీడీపీ నంద్యాల, కర్నూలు జిల్లాల అధ్యక్షులు మల్లెల రాజశేఖర్, పాలకుర్తి తిక్కారెడ్డి, పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబుతో కలిసి ప్రజా వేదిక ఏర్పాట్లను పరిశీలించారు. స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా సి.క్యాంపు రైతుబజార్‌లో పాల్గొంటారని అనంతరం నంద్యాల రోడ్ కేంద్రీయ విద్యాలయ సమీపంలో సభలో ప్రజలనుద్దేశించి మాట్లాడతారని తెలిపారు. కార్యక్రమంలో కల్లూరు అర్బన్ వార్డుల ఇన్‌చార్జ్ పెరుగు పురుషోత్తంరెడ్డి, తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌యాదవ్, పాణ్యం వాణిజ్య విభాగం అధ్యక్షుడు బ్రాహ్మణపల్లె నాగిరెడ్డి, ఆకెపోగు ప్రభాకర్, రామాంజనేయులు, కెవి.సుబ్బారెడ్డి, వంగాల జనార్ధన్‌రెడ్డి, వాకిటి మాదేష్ తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువులు వాడాలి

- భూసారాన్ని రాబోయే తరాలకు అందించాలి
- ఎన్‌జీ రంగా వసాయ కళాశాల అసోసియేట్ డీన్ జయలక్ష్మి
- ఎస్సీ రైతులకు సేంద్రియ ఎరువుల పంపిణీ


ఎస్సీ రైతులకు సేంద్రియ ఎరువులను అందజేస్తున్న జయలక్ష్మి

మహానంది, మే 15 (ఆంధ్రజ్యోతి): పర్యావరణానికి అనుకూలంగా ఉండే సేంద్రియ ఎరువులను వాడాలని ఆచార్య ఎన్‌జి రంగా వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ వి.జయలక్ష్మి అన్నారు. గురువారం మహానంది సమీపంలోని వ్యవసాయ కళాశాల ఆవరణలో సేంద్రియ వరి సాగు భూముల్లో సేంద్రియ ఎరువుల ప్రాచుర్యంపై గోస్పాడు మండలంలోని ఎస్సీ రైతులకు అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా జయలక్ష్మి మాట్లాడుతూ సేంద్రియ ఎరువులను వాడి భూసారాన్ని భావితరాలకు అందించాలన్నారు. ఆధునిక పద్ధతులతో రసాయనిక ఎరువుల వినియోగం పెరిగిందన్నారు. వరిలో దిగుబడి పెంచుకోవడానికి సమగ్ర పోషక యాజమాన్య పద్ధతులను పాటించాలని తెలిపారు. అనంతరం రైతులకు ఒక్కొక్కరికి 200 కేజీల వర్మికంపోస్టు, జీవన ఎరువులతోపాటు 2025-26 సంవత్సర వ్యవసాయ పంచాంగంను అందజేశారు. శాస్త్రవేత్త ఎల్.విజయ భాస్కర్, ఐసీఏఆర్ ఎస్సీ సబ్ ప్లాన్ ప్రాజెక్ట్ ప్రధాన పరిశోధకురాలు పీవీ గీతా శిరీష, వి. శివజ్యోతి పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లాపై సీఎం ప్రత్యేక దృష్టి

- రేపటి పర్యటనను విజయవంతం చేద్దాం
- టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి
- జనసేన, బీజేపీ, టీడీపీ నాయకులతో సమావేశం


మాట్లాడుతున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి

కర్నూలు అర్బన్, మే 15(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా అభివృద్ధిపై సీఎం చంద్రబాబు నాయుడు ప్రత్యేక దృష్టి సారించారని టీడీపీ జిల్లా అధ్యక్షులు తిక్కారెడ్డి అన్నారు. గురువారం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో జనసేన, బీజేపీ, టీడీపీ నాయకులతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈనెల 17న జిల్లా కేంద్రంలోని రైతుబజార్ వద్ద 'స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర' కార్యక్రమంతో పాటు నగర శివారులో ప్రజావేదిక ద్వారా పలుఅంశాలపై మాట్లాడతారని తెలిపారు.

ఉమ్మడి జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో అభివృద్ధి సమానం చేయాలనే లక్ష్యంతో పాణ్యం నియోజకవర్గ పర్యటన చేపట్టారని తెలిపారు. సూపర్ సిక్స్ హామీల్లో ఇప్పటికే కొన్నింటిని అమలు చేశారన్నారు. జూన్ 12న తల్లికి వందనం కింద ప్రతి విద్యార్థి తల్లి అకౌంట్లో ప్రకటించిన మేరకు మొత్తాన్ని జమ చేస్తారని అన్నారు. ఈ సమావేశంలో నంద్యాల నాగేంద్ర, కాసాని మహేష్‌గౌడ్, సత్రం రామక్రిష్ణుడు, బేతం కృష్ణుడు, హనుమంతరావు చౌదరీ, నంది మధు తదితరులు పాల్గొన్నారు.







ముస్లీం వివాహ సంబంధాలు
బిజినెస్, సాఫ్ట్‌వేర్, ప్రభుత్వ టీచర్స్, బ్యాంక్, పోస్టల్, రైల్వే, పోలీస్. డిఫెన్స్, డాక్టర్ సంబంధాలు కలవు. **స్టార్ ముస్లీం మ్యారేజ్ బ్యూరో,** నంద్యాల జిల్లా. సెల్ :87908 44959. (2వ సంబంధాలు కలవు)
AJL-236397

బంగారం కొనబడును
మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్, ఫైనాన్స్‌లో తాకట్టులో వున్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును. స్పాట్ క్యాష్, షిఫ్టింగ్ చేయబడును.(రిటైర్డు పోలీస్ డిపార్టు మెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కంపెనీ సంప్ర: 7382114647.
AJA- 237544

BUSINESS OFFER
★ తక్కువ ధరకు అమ్మకానికి సిద్ధంగా ఉన్న నెయిల్స్ & క్లాంప్స్ తయారీ యూనిట్. నెయిల్స్ & క్లాంప్స్ తయారు చేసే యంత్రాలు, పవర్ ప్రెస్‌లు, షీరింగ్ యంత్రాలు, ప్లేటింగ్ & పౌడర్ కోటింగ్ యంత్రాలు ఉత్తమ క్వాలిటీ, వర్కింగ్ కండిషన్లో తక్కువ ధరకు అమ్మకానికి ఉన్నాయి. స్థలం: అనంతపురం. సంప్రదించండి: పుష్కర్-9014175660
AJH-5578

పాఠకులకు ముఖ్య గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ ఇతరత్రా నమ్మించబడిన/ క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటన దారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/ యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి





రీ సర్వే పనులను పకడ్బందీగా చేపట్టాలి: ఆర్డీవో



మిట్టకందాలలో అధికారులతో మాట్లాడుతున్న ఆర్డీవో నాగజ్యోతి

పాములపాడు, మే 15(ఆంధ్రజ్యోతి) : మండలంలో జరుగుతున్న రీ సర్వే పనులను పకడ్బందీగా చేపట్టాలని ఆర్డీవో నాగజ్యోతి ఆదేశించారు. గురువారం మిట్టకందాల గ్రామంలో నిర్వహిస్తున్న పనులను ఆర్డీవో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 2005లో అగ్రిగోల్డ్ సంస్థ రైతుల నుంచి భూములు కొనుగోలు చేసిందని, ఆ భూములను గత ప్రభుత్వం స్వాధీనం చేసుకొందన్నారు. అయితే ఆ భూములను కూడా రీ సర్వే చేయాలని అధికారులకు సూచించారు. అలాగే రైతులు అధికారులకు సహకరించాలని సకాలంలో రీ సర్వే పనుల్లో ఎలాంటి ఇబ్బందులున్న సరి చేసుకోవాలని రైతులను కోరారు. కార్యక్రమంలో డీటీ పఠాన్‌బాబు, రీ సర్వే డీటీ సుప్రియ, ఆర్ఐ ఖాజబీ, వీఆర్వో ముర్తుజావలి సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పాలిసెట్‌లో విద్యార్థిని ప్రతిభ

ఆత్మకూరు, మే 15(ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన షేక్ అర్షియా అనే విద్యార్థిని ఏపీ పాలిసెట్ ఫలితాల్లో జిల్లా స్థాయిలో రెండో ర్యాంకును కైవసం చేసుకున్నట్లు అధ్యాపకుడు బాలరాజు గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆన్‌లైన్ శిక్షణ పొందిన షేక్ అర్షియా పాలిసెట్‌లో 125 మార్కులకు గానూ 95 మార్కుల సాధించిందన్నారు. విద్యార్థులు టెక్నికల్ రంగాల్లో కూడా రాణించాలని సూచించారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన షేక్ అర్షియాను ఆయన అభినందించారు.

ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోండి

ఆత్మకూరు, మే 15(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ పరిధిలోని స్మార్ట్ సిటీలో భాగంగా వీధివ్యాపారులు రీసర్వే వెండర్ కనెక్ట్ యాప్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని గుర్తింపు కార్డులను పొందాలని మున్సిపల్ కమిషనర్ రమేష్‌బాబు తెలిపారు. ఈ సందర్భంగా గురువారం ఆయన మాట్లాడుతూ దరఖాస్తుదారులు తమ అప్లికేషన్ ఫారం, ఆధార్, రేషన్, బ్యాంకు అకౌంట్ పాస్‌పుస్తకం, మొబైల్ నంబర్, పాస్‌పోర్టు సైజ్ ఫొటో, ఫ్యామిలీ ఫొటోలతో పాటు రూ.150 రుసుము చెల్లించాల్సి ఉంటుందన్నారు. సర్వే అనంతరం వీధి వ్యాపారులను గుర్తించి వారికి గుర్తింపు కార్డులతో పాటు వెండింగ్ సర్టిఫికెట్‌ను జారీ చేస్తామని తెలిపారు. అర్హులైన వ్యాపారులు ఈ నెల 15 నుంచి 20వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

పాములపాడు, మే 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని వేంపెంట గ్రామంలో టీడీపీ కార్యకర్త నులక నాగేశ్వరరావు (50) అనారోగ్యంతో మృతి చెందాడు. గురువారం సింగపూర్ తెలుగు సమాజం ఉపాధ్యక్షుడు, టీడీపీ నాయకుడు డాక్టర్ టేకూరి నాగేశ్వరరావు సూచనల మేరకు మాజీ సర్పంచ్ టేకూరి రామసుబ్బమ్మ మృతుడికి నివాళులు అర్పించి, కుటుంబ సభ్యులకు రూ.ఐదువేలు ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మాజీ సర్పంచ్ సత్యరాజ్, మాజీ ఎంపీటీసీ శివకుమార్, నాయకులు సుబ్బరావు, రాజేష్, వినయ్, యువరాజ్, వేమారెడ్డి, మధు, శేషు, మునిరాజ్, సురేశ్, నాయుడు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

నంద్యాల కల్చరల్, మే 15(ఆంధ్రజ్యోతి): నంద్యాల మిల్క్ డెయిరీ సమీపంలో గురువారం తెల్లవారుజామున పిడుగు పడింది. దాంతో చాబోలులో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడినట్లు రూరల్ ఏఈ శ్రీనివాసులు తెలిపారు. గురువారం ఉదయం 3గంటల ప్రాంతంలో పిడుగు పడినట్లు తెలిపారు. పిడుగు పడడటం వలన ఎటువంటి నష్టం జరగలేదన్నారు.

రేపు మండల సర్వసభ్య సమావేశం

కొత్తపల్లి, మే 15(ఆంధ్రజ్యోతి): మండల సర్వసభ్య సమావేశాన్ని శనివారం ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో మేరీ తెలిపారు. సర్వసభ్య సమావేశం ఎంపీపీ కిచ్చెన్నగారి కుసుమలత అధ్యక్షతన నిర్వహిస్తున్నామన్నారు. జడ్పీటీసీలు, సర్పంచులు, ఎంపీ టీసీలు ఆయా శాఖల మండల అధికారులు, మండల కోఆప్షన్ సభ్యులు తప్పనిసరిగా నివేదికలతో హాజరు కావాలని కోరారు. సర్వసభ్య సమావేశానికి హాజరయ్యే ఆయా శాఖల మండల అధికారులు మూడు నెలల క్రితం జరిగిన అభివృద్ధి ప్రణాళికలతో హాజరు కావాలని చెప్పారు.

ఫామ్‌హౌస్‌లో వ్యక్తి మృతి


మహానంది, మే 15(ఆంధ్రజ్యోతి): మహానంది మండలం బుక్కాపురం సమీపంలోని ఫామ్ హౌస్‌లో ఓ వ్యక్తి మృతిచెందినట్లు ఎస్ఐ రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. వివరాలు.. మండలంలోని గాజులపల్లికి చెందిన మహమ్మద్ ఖాసీం(47) అనే వ్యక్తి ఫామ్‌హౌస్‌లో దినసరి కూలీగా పనిచేస్తున్నాడు. గురువారం మొక్కలకు నీరు పడ్తున్న ఖాసీం మూర్ఛ వ్యాధికి గురయ్యాడు. ఈక్రమంలో పక్కనే ఉన్న స్విమ్మింగ్‌పూల్‌లో పడ్డాడు. అక్కడ విధులు నిర్వహిస్తున్న వారు గమనించి అక్కడికి చేరుకునేలోగానే మృతిచెందాడు. మృతుడి భార్య రహమ్మత్‌బీ కూడా ఇదే ఫామ్‌హౌస్‌లో పనిచేస్తుంది. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

ముగ్గురికి గాయాలు

మహానంది, మే 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బోయలకుంట్ల మెట్ట వద్ద గురువారం రాత్రి ఎదురెదురుగా వస్తున్న రెండు మోటార్ బైక్‌లు ఢీకొన్నాయి. ఈ ఘటనలో రుద్రవరం మండలం బీరవోలుకు చెందిన తలారి వేణు(19) అనే యువకుడు మృతి చెందాడు. ఎస్ఐ రామ్మోహన్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. బీరవోలుకు చెందిన తలారి వేణు, మధుక్రిష్ణలు సొంత పనిమీద నంద్యాల నుంచి మోటార్ బైక్‌పై స్వగ్రామం వస్తుండగా మార్గమధ్యలోని బోయలకుంట్ల మెట్ట వద్ద ఎదురుగా వస్తున్న మరో బైక్ ఢీ కొంది. ఈ ప్రమాదంలో తలారి క్రిష్ణ అక్కడికక్కడే మృతి చెందాడు. ఎదురుగా మోటార్ బైక్‌పై ప్రయాణిస్తున్న శిరివెళ్ల మండలం గంగవరానికి చెందిన రమణ, బాలుతో పాటు బీరవోలుకు చెందిన మధు క్రిష్ణలు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసునమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కౌలు కార్డుల కోసం దరఖాస్తు చేసుకోండి



మాట్లాడుతున్న ఏడీఏ ఆంజనేయ

ఆత్మకూరురూరల్, మే 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని కౌలు రైతులు కౌలు కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవాలని ఏడీఏ ఆంజనేయ కోరారు. గురువారం మండలంలోని శ్రీపతిరావు పేట, కృష్ణాపురం గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో మండల వ్యవసాయాధికారి డీ. విష్ణువర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో కౌలు రైతులకు అవగాహన సదస్సు నిర్వహించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో రైతు సేవా కేంద్రం సిబ్బంది, వీఆర్‌వోలు, ఎంపీఈవోలు పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

జిల్లా మలేరియా అధికారి డాక్టర్ కామేశ్వరరావు



పోస్టర్‌ను విడుదల చేస్తున్న అధికారులు

నంద్యాల హాస్పిటల్, మే 15(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, దీంతో దోమల వ్యాప్తి జరగదని జిల్లా మలేరియా అధికారి డాక్టర్ కామేశ్వరరావు అన్నారు. గురువారం జీజీహెచ్‌లోని ఎంసీహెచ్ బ్లాక్ సమావేశహాల్‌లో డెంగీ నివారణపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ డెంగీను ఓడించడానికి మూడు పద్ధతులు పాటించాలన్నారు. పరిశీలించడం, శుభ్రం చేయడం, మూతలు పెట్టడం వంటి మూడు పద్ధతులు పాటిస్తే డెంగీను నివారించవచ్చని అన్నారు. ఆడ ఏడిస్ దోమకాటుతో డెంగీ వస్తుందని డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటరమణ అన్నారు. దోమలు కుట్టకుండా వ్యక్తిగత జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పరిసరాలు పరి శుభ్రంగా ఉంచుకుంటేనే వ్యాధుల బారినపడకుండా ఉంటారన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ మనోహర్ మాట్లాడుతూ కుళాయి పైపులు లీకేజీ లేకుండా తమ సిబ్బందితో పర్యవేక్షిస్తామన్నారు. మత్స్యశాఖ అధికారి రాఘవరెడ్డి మాట్లాడుతూ వర్షాకాలంలో గంబూషియా చేపలను సరఫరా చేసేందుకు అన్నివిధాలా చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం జాతీయ డెంగీ నివారణ దినోత్సవ పోస్టర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో వైద్య ఆరోగ్యశాఖ ప్రోగ్రాం అధికారులు డాక్టర్ సురేషన్‌బాబు, డా.అంకిరెడ్డి, డా.కాంతారావునాయక్, డా.భరత్‌కుమార్, డా.తేజస్విని, జిల్లా మలేరియా సహాయ అధికారి రామవిజయరెడ్డి, డా.ప్రసన్నలక్ష్మి, సబ్ యూనిట్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మొక్కుబడిగా మండల సమావేశం

- కీలక అధికారులు డుమ్మా
- నివేదికలు చదివి మమ అనిపించిన వైనం



మాట్లాడుతున్న తహసీల్దార్ రత్నరాధిక

ఆత్మకూరు, మే 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎంపీడీవో కార్యాలయ సమావేశ భవనంలో గురువారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం మొక్కుబడిగా సాగింది. ఎంపీపీ తిరుపాలమ్మ అధ్యక్షతన జరిగిన సమావేశానికి విద్య, వైద్యం, వ్యవసాయం, ఆర్టీసీ, అటవీ, పోలీసు, ఆర్‌అండ్‌బీ, ఐటీడీఏ, ఆర్‌డబ్ల్యూఎస్, ఐసీడీఎస్ తదితర శాఖలకు చెందిన కీలకమైన అధికారులందరు డుమ్మా కొట్టారు. వారి స్థానంలో కిందిస్థాయి సిబ్బంది సమావేశానికి హాజరయ్యారు. తమ శాఖకు సంబంధించిన ప్రగతి నివేదికలను చదివి వినిపించి మమ అనిపించారు. అదేవిధంగా ఆయా గ్రామాలకు చెందిన ఎంపీటీసీలు, సర్పంచ్‌లు సైతం పూర్తిస్థాయిలో హాజరుకాలేదు. వచ్చిన వారిలో కూడా ఒకరు ఇద్దరు మినహాయించి మిగతా వారెవరూ నోరెత్తి సమస్యలపై గళాన్ని వినిపించిన దాఖలాల్లేవు. అలాగే మహిళా ప్రజాప్రతినిధులకు బదులు వారి భర్తలు దర్జాగా సమావేశానికి హాజరయ్యారు. కాగా తహసీల్దార్ రత్నరాధిక మాట్లాడుతూ.. ప్రస్తుతం కొత్తరేషన్ కార్డులు, చేర్పులు, ఇతర సేవల గురించి వివరించి వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అదేక్రమంలో రీసర్వే వల్ల తమ భూమి కోల్పోయామని వడ్లరామాపురం గ్రామానికి చెందిన కోఆప్షన్ సభ్యుడు మౌలాలి అన్నారు. సమావేశంలో ఎంపీడీవో సుబ్రమణ్యం, జడ్పీటీసీ శంకరరెడ్డి ఉన్నారు.

గృహ నిర్మాణాన్ని వేగవంతం చేయండి: పీడీ



లబ్ధిదారులతో మాట్లాడుతున్న హౌసింగ్ పీడీ హరిగోపాల్

ఆత్మకూరు, మే 15 (ఆంధ్రజ్యోతి): గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలని జిల్లా హౌసింగ్ పీడీ హరిగోపాల్ అన్నారు. గురువారం పట్టణంలో లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ఆర్థిక భారంతో మధ్యలోనే నిలిచిన గృహాలను పూర్తి చేసేందుకు గాను ప్రభుత్వం అదనపు ఆర్థిక సాయాన్ని అందిస్తున్నట్లు తెలిపారు. ఆయన వెంట హౌసింగ్ ఈఈ విజయబాబు, ఆత్మకూరు ఏఈ ఉమామహేశ్వరరెడ్డి, వర్క్‌ఇన్‌స్పెక్టర్లు పుల్లయ్య, సుబ్బలక్ష్మమ్మ ఉన్నారు.

విద్యుదాఘాతంతో పాడిగేదె మృతి

పాములపాడు, మే 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రుద్రవరం గ్రామంలో విద్యుదాఘాతంతో పాడిగేదె మృతి చెందింది. గురువారం స్థానిక రైతు జడల శ్రీనివాసులుకు చెందిన పాడిగేదె స్థానిక ఎస్సీ కాలనీ సమీపంలోని మేత మేస్తుండగా అక్కడే వేలాడుతున్న కరెంటు తీగ తగిలి విద్యుత్‌షాక్‌తో మృతి చెందింది. దీంతో 70 వేల రూపాయల విలువ గల పాడిగేదె మరణించిందని విద్యుత్ శాఖ అధికారులు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.

కౌలుకార్డులు తప్పనిసరి

బండిఆత్మకూరు, మే 15(ఆంధ్రజ్యోతి): రైతుల భూములను సాగుచేసే కౌలు రైతులు తప్పనిసరిగా కౌలుకార్డులు తీసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి మురళీకృష్ణ సూచించారు. గురువారం ఏకోదూరు గ్రామంలోని రైతు సేవా కేంద్రంలో రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడతూ కౌలుకార్డులు ఉంటే ప్రభుత్వం నుంచి అందే సబ్సిడీలు, నష్ట పరిహారాలు, పంట రుణాలు పొందవచ్చున్నారు. ఈకార్డులు కేవలం 11 నెలల కాల పరిమితి మాత్రమే పని చేస్తాయన్నారు. ఏడీఏ రాజశేఖర్, ఏవో స్వాతి, సిబ్బంది పాల్గొన్నారు.

సీహెచ్‌వోలకు న్యాయం చేయాలి



ధర్నా చేస్తున్న సీహెచ్‌వోలు

నంద్యాల హాస్పిటల్, మే 15(ఆంధ్రజ్యోతి): కమ్యూనిటీహెల్త్ ఆఫీసర్ల(సీహెచ్‌వో) కడుపుకోతను గుర్తించి న్యాయం చేయాలని వేడుకున్నారు. గురువారం నంద్యాలలోని బీఎస్ఎన్ఎల్ కార్యాలయం వద్ద నిర్వహిస్తున్న సీహెచ్‌వోల ఆందోళన 18వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెండేళ్లుగా సమస్యలు పరిష్కారం కాకపోవడంతో నిరవధిక సమ్మె చేయాల్సి వచ్చిందన్నారు. నేషనల్ హెల్త్‌మిషన్‌లో సిబ్బందితో సమానంగా 23శాతం వేతన సవరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం రాష్ట్ర నాయకులతో చర్చలు జరిపి తమ ఆవేదనను గ్రహించాలని కోరారు. కార్యక్రమంలో అధ్యక్షుడు శివకృష్ణ, సౌందర్య, భాస్కర్, సెక్రటరీలు గురుప్రసాద్, అఖిల్, భార్గవ్, హారిక పాల్గొన్నారు.

శ్రీశైలంలో 'స్వచ్ఛాంధ్ర'

శ్రీశైలం, మే 15 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలక్షేత్ర పరిధిలో గురువారం స్వచ్ఛాంధ్ర సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గంగాధర మండపం నుంచి నందిగుడి వరకు దేవస్థానం అధికారులు, సిబ్బంది ప్లకార్డులు పట్టుకొని అవగాహన ర్యాలీ నిర్వహించారు. పారిశుధ్య కార్యక్రమానికి క్షేత్రపరిధిని ఆరుజోన్లు, 11 సెక్టార్లుగా, 66 ప్రదేశాలుగా విభజించి పారిశుధ్య కార్యక్రమాన్ని పర్యవేక్షించేందుకు ప్రతీ జోన్‌కు దేవస్థానం యూనిట్ అధికారులకు, పర్యవేక్షకులకు, సిబ్బందికి ప్రత్యేక విధులు కేటాయించారు. ఈ సందర్భంగా క్షేత్రంలోని పలు ప్రదేశాలను, ఆలయాలను, రహదారులను మొదలైన ప్రాంతాలలో పారిశుధ్య పనులు చేపట్టారు. కార్యక్రమంలో దేవస్థానం అధికారులు, సిబ్బంది, శివసేవకులు పాల్గొన్నారు.

స్వచ్ఛభారత్ పనుల పరిశీలన

పాణ్యం, మే 15 (ఆంధ్రజ్యోతి): ఈనెల 17వ తేదీన పాణ్యంలో జరిగే స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేయనున్న పనులను ఆర్టీసీ ఆర్ఎం రజియాసుల్తానా, పాణ్యం తహసీల్దార్ నరేంద్రనాధ్‌రెడ్డి పరిశీలించారు. గురువారం పాణ్యం బస్టాండ్ సమీపంలో చేపట్టిన మరుగుదొడ్ల నిర్మాణ పనులు, చెట్లు వాటి పరిసరాలను పరిశీలించారు. చెత్తా చెదారం తొలగించి గ్రావెల్‌తో చదును చేయించారు. కలెక్టర్ స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో పాల్గొని వివిధ అభివృద్ధి పనులు ప్రారంభించనున్నట్లు తహసీల్దార్ నరేంద్రనాధ్‌రెడ్డి తెలిపారు. వీఆర్వో బీరేంద్రకుమార్, శంకర్, సచివాలయ కార్యదర్శి శివకుమార్, ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

నిర్ణీత కొలతలు పాటించాలి

బండిఆత్మకూరు మే15(ఆంధ్రజ్యోతి): నీటి కుంటల తవ్వకాల్లో కూలీలు నిర్ణీత కొలతలు పాటించాలని ఎంపీడీవో దస్తగిరి సూచించారు. గురువారం మండలంలోని పరమటూరు గ్రామంలో నీటి కుంట తవ్వకాలను ఆయన పరిశీలించారు. ప్రభుత్వ నిబంధనల అనుసారం తవ్వితే పూర్తి కూలి లభిస్తుందని, కొలతులు అనుసరించాలని సూచించారు.

బ్లడ్ బ్యాంక్ తనిఖీ

నంద్యాల హాస్పిటల్, మే 15(ఆంధ్రజ్యోతి): స్థానిక జీజీహెచ్‌లోని బ్లడ్‌బ్యాంక్‌ను గురువారం డ్రగ్ ఇన్‌స్పెక్టర్ ఖలందర్ తనిఖీ చేశారు. బ్లడ్‌బ్యాంక్‌లో ఏసీ లేని విషయాన్ని, బ్లడ్‌బ్యాంక్ అనుమతిపత్రాన్ని మార్చుకోవాలని ఉన్నతాధికారులకు నివేదిక పంపుతామన్నారు. ఏసీలు లేని విషయంపై సిబ్బంది నిధుల్లేవని చెప్పడం విశేషం.

ఆత్మకూరులో 51.4 మి.మీ. వర్షపాతం

- పలుచోట్ల నేలకూలిన వృక్షాలు



వేంకటేశ్వర స్వామి ఆలయంలో నేలకూలిన మామిడి చెట్టు

ఆత్మకూరు, మే 15(ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు ప్రాంతంలో బుధవారం అర్ధరాత్రి భారీ వర్షం కురిసింది. రాత్రి 11గంటల సమయం నుంచే బలమైన గాలులతో పాటు ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. జిల్లాలోనే ఆత్మకూరు అత్యధికంగా 51.4మిమీల వర్షాపాతం నమోదైంది. అదేక్రమంలో ఆత్మకూరు పరిసర ప్రాంతాల్లో పెద్దపెద్ద శబ్దాలతో పిడుగులు పడటంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. అయితే గాలుల బీభత్సవానికి ఆత్మకూరు పట్టణంలోని పలు చోట్ల వృక్షాలు నేలకూలాయి. ప్రత్యేకించి వేంకటేశ్వర స్వామి ఆలయంలోని మామిడి చెట్టు విరిగిపడింది. పలు కార్యాలయాల వద్ద భారీగా వర్షపునీరు నిలిచింది. మున్సిపాలిటీ సిబ్బంది గురువారం ఉదయం నుంచే ఆయా కాలనీల్లో నిలిచి వర్షపునీటిని కాల్వలకు మళ్లించేలా చర్యలు చేపట్టారు. ఇదిలావుంటే ఖరీఫ్ సీజన్‌కు ముందుగానే భారీ వర్షం కురియడంతో పంట పొలాలకు ప్రయోజనం చేకూరనుందని రైతులు ఆనందం వ్యక్తం చేశారు. ఇదేతరహాలో మరో వర్షం కురిసినట్లయితే విత్తనాలు విత్తేందుకు రైతులు సన్నద్ధం కానున్నారు.

నంద్యాల ఎడ్యుకేషన్: నంద్యాల జిల్లాలో గురువారం తెల్లవారుజామున కురిసిన మోస్తరు వర్షానికి జిల్లాలో ఉష్ణోగ్రతలు ఒక్కసారిగా చల్లబడ్డాయి. ఆత్మకూరులో అత్యధికంగా 51.4 ఎంఎం వర్షపాతం నమోదైంది. రుద్రవరం 50.8, కొత్తపల్లె 50.4, డోన్ 26.8, గడివేముల 22.2, దొర్నిపాడు 20.4, మహానంది 19.2, పాములపాడు 17.4, కోవెలకుంట్ల 16.6, బేతంచర్ల 16.6, అవుకు 15.2, గోస్పాడు 13.2, ప్యాపిలి 13.0, వెలుగోడు 10.6, పాణ్యం 10.0, ఆళ్లగడ్డ 9.4, కొలిమిగుండ్ల 8.4, శిరువెళ్ల 8.2, నంద్యాల 6.4, జూపాడుబంగ్లా 5.8, మిడ్తూరు 5.4, పగిడ్యాల 4.6, శ్రీశైలం 4.6, బండిఆత్మకూరు 4.6, నందికొట్కూరు 4.0, చాగలమర్రి 3.2, బనగానపల్లె 2.8, సంజామల 1.8 ఎంఎం వర్షపాతం నమోదైంది.

పేదలకు వరం సీఎం సహాయ నిధి



చెక్కులను అందుకున్న లబ్ధిదారులతో ఎమ్మెల్యే బుడ్డా

వెలుగోడు, మే 15(ఆంధ్రజ్యోతి): పేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి ఓ వరం అని శ్రీశైలం నియోజకవర్గం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరెడ్డి అన్నారు. గురువారం మండలంలోని వేల్పనూరు గ్రామంలో ఎమ్మెల్యే నివాసంలో నియోజకవర్గంలోని 35 మంది లబ్ధిదారులకు సీఎం సహాయ నిధి ద్వారా రూ . 16,23,711 లక్షలు మంజూరు అయ్యాయి. ఆ చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బన్నూరు రామలింగారెడ్డి, అన్నారపు శేషిరెడ్డి, అబ్దుల్లాపురం బాషా, పలువురు నాయకులు పాల్గొన్నారు.

వినియోగదారులకు అవగాహన

గడివేముల, మే 15 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ మెట్రాలజీ దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలోని భారత్‌గ్యాస్ కార్యాలయంలో గురువారం వినియోగదారులకు లీగల్ మెట్రాలజీ అసిస్టెంట్ కంట్రోలర్ జిలాని బాష అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాణిజ్యంలో ఖచ్చితమైన కొలతలు వినియోగదారుల నమ్మకాన్ని పెంచుతాయని అన్నారు. లీగల్ మెట్రాలాజీ చట్టాలను పటిష్టంగా అమలు చేయడం వల్ల ఆర్థిక వ్యవస్థకు లాభాలు చేకూరుతాయని అన్నారు. వినియోగదారులు వస్తువులను కొనుగోలు చేసేటప్పుడు తూకాలను, నాణ్యతను పరిశీలించాలని అన్నారు. వ్యాపారులు అవకతవకలకు పాల్పడితే తమ దృష్టికి తీసుకొని రావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో గడివేముల భారత్ గ్యాస్ ప్రొప్రైటర్ కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

21 నుంచి వేసవి శిక్షణ తరగతులు

నంద్యాల ఎడ్యుకేషన్, మే 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక రామకృష్ణా డిగ్రీ కళాశాలలో ఈనెల 21వ తేదీ నుంచి ఉచిత వేసవి శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నట్లు ఆ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ జి.రామకృష్ణారెడ్డి తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆసక్తి కలిగిన యువతకు డీటీపీ, సీ లాంగ్వేజీ, టాలీ విత్ జీఎస్టీ, వెబ్‌సైట్ డిజైన్, పుట్టగొడుగుల పెంపకం, యోగా, కూచిపూడి నృత్యం, కమ్యూనికేటివ్, స్పోకెన్ ఇంగ్లీష్ తదితర కోర్సులపై శిక్షణ ఇస్తారన్నారు. వివరాలకు శ్రీనివాసనగర్‌లోని తమ కళాశాలలో సంప్రదించాలని కోరారు. కళాశాల డైరక్టర్ హేమంత్‌రెడ్డి, ప్రిన్సిపాల్ కేబీవీ సుబ్బయ్య, డీన్ ఆఫ్ స్టూడెంట్ అఫైర్స్ ప్రగతిరెడ్డి పాల్గొన్నారు.

చికెన్ వ్యాపారులకు బెదిరింపులు

నంద్యాల టౌన్, మే 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక చికెన్ వ్యాపారులను ఆళ్లగడ్డకు చెందిన రమీజా అనే మహిళ బెదిరిస్తుందని వాపోతున్నారు. గురువారం స్థానిక ఎస్పీ కార్యాలయం వద్ద తమకు నాయ్యం చేయాలని ఎస్పీ అదిరాజ్ సింగ్ రాణాను ఆశ్రయించారు. ఈ సందర్భంగా చికెన్ వ్యాపారులు చాంద్‌బాష, ముజీబ్, ఖాజా, షవేరా మాట్లాడుతూ 15 ఏళ్ల నుంచి వ్యాపారం చేస్తున్నామని తెలిపారు. రమీజా మహిళ తమ వద్దనే కోళ్లు కొనాలని, లేదంటే వ్యాపారం ఎలా చేస్తారని బెదిరింపులకు పాల్పడుతుందన్నారు. చెప్పిన రేట్లకే అమ్మాలని లేకపోతే దుకాణాలు తీసేస్తామని హెచ్చరిస్తుందన్నారు. పోలీసు అధికారులు తగిన చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని కోరారు. అనంతరం ఎస్పీ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు.

రైల్వే జోన్ కన్సల్టెటివ్ మెంబర్‌గా నాగేశ్వరరావు

నందికొట్కూరు, మే 15 (ఆంధ్రజ్యోతి) : సౌత్ రైల్వే జోన్ కన్సల్టెటివ్ మెంబర్‌గా తరిగోపుల నాగేశ్వరరావు నియమితులయినట్లు సికింద్రాబాద్ జనరల్ మేనేజర్ కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. గురువారం మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి నివాసంలో తరిగోపుల నాగేశ్వరరావు మాట్లాడుతూ తాను బైరెడ్డి కుటుంబానికి చిత్తశుద్ధితో ఉండడం వల్లే తనకు ఈ పదవి దక్కిందన్నారు. రైల్వే శాఖలో ప్రజలకు ఎదురవుతున్న సమస్యలు, రైల్వే సేవలను మెరుగు పరచడం, ప్రజల నుంచి అభిప్రాయాలు సేకరించడం వంటి వాటిపై దృష్టి సారిస్తామన్నారు. నాగేశ్వరరావుకు కౌన్సిలర్ చాంద్‌బాష, టీడీపీ నాయకుల పల్లె రఘురామిరెడ్డి, కట్టుబడి శ్రీనివాసులు, గుణశేఖర్‌రెడ్డి, అబ్దుల్ సుకూర్, సాహెబ్‌ఖాన్, గోకారి, పైపాలెం నాగేశ్వరరావు తదితరులు శుభాకాంక్ష లు తెలిపారు.

మార్క్‌ఫెడ్ ప్లాంట్ మేనేజర్‌కు సీఎం ప్రశంస

నంద్యాల ఎడ్యుకేషన్, మే 15(ఆంధ్రజ్యోతి): జిల్లా మార్క్‌ఫెడ్ ప్లాంట్ మేనేజర్ నాగరాజు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నుంచి ప్రశంసలు పొందారు. విజయవాడలో బుధవారం జరిగిన పశుసంవర్ధకశాఖ టెక్ ఏఐ 2.0 కాంక్లేవ్ సదస్సులో పశుసంవర్ధకశాఖకి విలువైన భాగస్వామిగా ఉన్న మార్క్‌ఫెడ్ ప్లాంట్ మేనేజర్ నాగరాజును సీఎం అభినందిస్తూ జ్ఞాపికను బహూకరించారు. పశుసంవర్ధకశాఖకు వస్తున్న దాణా, మందులు ఇతర వస్తువులను మార్క్‌ఫెడ్ ద్వారా త్వరితగతిన అందజేస్తూ మంచి గుర్తింపు పొందడంపై నాగరాజును ప్రత్యేకంగా ముఖ్యమంత్రి అభినందించారు.

రామన్న ఆశయాలను కొనసాగిద్దాం

మహానంది, మే 15 (ఆంధ్రజ్యోతి): భూ పోరాటయోధుడు నక్కి రామన్న ఆశయాలను కొనసాగిద్దామని మండల సీపీఐ నాయకులు అన్నారు. గురువారం మహానంది మండలం బుక్కాపురంలో కామ్రేడ్ నక్కి రామన్న 35వ వర్ధంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి సీపీఐ నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి సామేలు, రాజాతో పాటు మండల సహాయ కార్యదర్శి వెంకటేశ్వర్లు, రామేశ్వరయ్య, నరసింహుడు, మహిళా నాయకురాళ్లు రేష్మ, వరలక్ష్మి, సుబ్బమ్మ రమణమ్మ, వాణిబాయ్ పాల్గొన్నారు.

ఘనంగా మంత్రి ఫరూక్ జన్మదిన వేడుకలు





మంత్రి ఫరూక్ చిత్రంతో కూడిన కేక్, మంత్రికి శుభాకాంక్షలు తెలుపుతున్న అభిమానులు, పేదలకు పండ్లు, పాలు పంపిణీ చేస్తున్న మంత్రి తనయుడు ఖలీల్

నంద్యాల రూరల్, మే 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ 75వ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. గురువారం తెలుగు రైతు రాష్ట్ర ఉపాధ్యక్షులు గుంటుపల్లి హరిబాబు ఆధ్వర్యంలో రైతునగర్ సమీపంలోని సాయిఈశ్వర్ నగర్ వృద్ధాశ్రమంలో అనాథ వృద్ధుల మధ్య మంత్రి ఫరూక్ కేక్ కట్ చేశారు. అనంతరం వృద్ధులకు చీరలు పంపిణీ చేశారు. వారితో కలిసి అల్పాహార విందును స్వీకరించి వృద్ధుల ఆశీస్సులు పొందారు. ప్రభుత్వ వైద్యకేంద్రంలో పలువురు రోగులకు మంత్రి ఫరూక్ పాలు, పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేసి అందరూ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.



వృద్ధులకు చీరలు పంపిణీ చేస్తున్న మంత్రి

టీడీపీ కార్యాలయంలో.. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో మంత్రి ఫరూక్ కేక్‌కట్ చేశారు. అనంతరం టీడీపీ నాయకులు, అభిమానులు, కార్యకర్తల నుంచి జన్మదిన శుభాకాంక్షలు అందుకున్నారు. ఇదే క్రమంలో పట్టణంలోని పలు వృద్ధాశ్రమాల్లో అభిమానులు, కార్యకర్తలు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. వైఎస్సార్‌నగర్ 38 వ వార్డు ఇన్‌చార్జి తాటికొండ బుగ్గరాముడు ఆధ్వర్యంలో మంత్రి ఎన్ఎండీ ఫరూక్ తనయుడు ఎన్ఎండీ ఖలీల్ చేతుల మీదుగా పేదలకు, వృద్ధులకు పాలు, బ్రెడ్లు, పండ్లు పంపిణీ చేశారు.

డోన్

డోన్, ఆళ్లగడ్డ, బనగానపల్లె

వైభవంగా అశ్వవాహన సేవ


వెల్లాలక్షేత్రంలో చెన్నకేశవ ఉత్సవమూర్తుల ఊరేగింపు

చాగలమర్రి, మే 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెల్లాల క్షేత్రంలో చెన్నకేశవ, సంజీవరాయ, భీమలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా గురువారం అశ్వవాహన సేవ నిర్వహించారు. చెన్నకేశవ ఉత్సవమూర్తుల గ్రామోత్సవం చేపట్టారు. సంజీవరాయస్వామికి వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. వేద పండితులు మాధవాచార్యులు, శేషాచారుల ఆధ్వర్యంలో ఉభయదారులచే పూర్ణాహుతి హోమం నిర్వహించారు. కార్యక్రమంలో ఈవో వెంకటరమణ, కమిటీ సభ్యులు లక్ష్మీనారాయణరెడ్డి, నరసింహారెడ్డి, ఆలయ ఉద్యోగులు, ప్రధాన అర్చకులు, మహిళలు పాల్గొన్నారు.

ఉమామహేశ్వరుడిని దర్శించుకున్న కలెక్టర్


కలెక్టర్ దంపతులకు స్వామివారి జ్ఞాపికను అందిస్తున్న ఈవో చంద్రుడు

బనగానపల్లె, మే 15 (ఆంధ్రజ్యోతి): యాగంటి ఉమామహేశ్వరస్వామిని కలెక్టర్ రాజకుమారి గనియా దంపతులు గురువారం దర్శించుకున్నారు. కలెక్టర్ దంపతులు ఆలయం వద్దకు చేరుకోగా అర్చకులు, ఈవో చంద్రుడు స్వాగతం పలికారు. అనంతరం ఉమామహేశ్వరస్వామికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు, ఆలయ అధికారులు కలెక్టర్‌కు స్వామివారి చిత్రపటాన్ని బహూకరించారు. కార్యక్రమంలో యాగంటిపల్లె ఉప సర్పంచ్ మౌళీశ్వరరెడ్డి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

రామన్న ఆశయ సాధనకు కృషి చేద్దాం

డోన్ టౌన్, మే 15 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా కమ్యూనిస్టు యోధుడు అమరజీవి నక్కి రామన్న ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కే.రామాంజనేయులు అన్నారు. గురువారం సీపీఐ కార్యాలయంలో రామన్న 35వ వర్ధంతి సభను సీపీఐ పట్టణ కార్యదర్శి మోటరాముడు అధ్యక్షతన నిర్వహించారు. రామన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఐ, నాయకులు బి.నారాయణ, నక్కి బాలమ్మ, పులి శేఖర్, హుశేన్ పీరా, ఎన్కే రామ్మోహన్, ఏఐటీయూసీ నాయకులు అన్వర్, అబ్బాస్, ఏఐఎస్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి చర్యలు

బనగానపల్లె, మే 15 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టినట్లు డోన్ డీఎస్పీ శ్రీనివాసులు గురువారం తెలిపారు. బనగానపల్లె పోలీస్ స్టేషన్‌లో సీఐలు ప్రవీణ్ కుమార్, మంజునాథరెడ్డి, ఎస్ఐ దుగ్గిరెడ్డితో సమావేశాన్ని నిర్వహించారు. డీఎస్పీ మాట్లాడుతూ పట్టణంలో రద్దీగా ఉండే ప్రాంతాల్లో ట్రాఫిక్ పోలీసుల సంఖ్యను పెంచుతున్నామన్నారు. దద్దనాల ప్రాజెక్టు వద్ద ప్రమాదాలు జరుగకుండా చర్యలు చేపట్టామన్నారు. జాహిద్ హుశేన్, మరో నలుగురిపై రౌడీషీట్ ఓపెన్ చేసినట్లు తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే సహించేది లేదని హెచ్చరించారు.

పండ్ల తోటలు సాగు చేయండి

సంజామల, మే 15(ఆంధ్రజ్యోతి): మండల రైతులు పండ్ల తోటలను సాగుచేసి అధిక ఆదాయాన్ని గడించాలని ఎంపీడీవో సాల్మన్ అన్నారు. గురువారం పండ్ల తోటల సాగుపై వ్యవసాయ అధికారి సుధాకర్ రెడ్డి, ఉద్యానవనశాఖ అధికారి రవికిరణ్, ఎన్.ఆర్.ఈ.జీ.ఎస్ ఏపీవో జయంతి ఆధ్వర్యంలో సిబ్బంది సచివాలయ, ఎన్ఆర్ఈజీఎస్, ఏఈవోలకు అవగాహన సదస్సు నిర్వహించారు. రైతులను చైతన్య పరిచి పండ్ల తోట సాగుకు సిద్ధం చేయాలన్నారు. వందశాతం రాయితీతో పండ్ల తోటల సాగుకు ప్రభుత్వం సహాయం అందిస్తుం దన్నారు.

కౌలు వేలంలో పెరిగిన ఆదాయం

ఉయ్యాలవాడ, మే 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇంజేడు గ్రామంలో నిర్వహించిన దేవాదాయ భూముల కౌలు వేలంలో ఆదాయం పెరిగినట్లు ఈవో చంద్రుడు తెలిపారు. గురువారం వెంకటేశ్వరస్వామి దేవాలయంలో ఏడాది పాటు కౌలు వేలం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాములవారికి చెందిన 50 ఎకరాల భూమికి కౌలు వేలంలో రూ. 5.49 లక్షలు పలికిందన్నారు. గతేడాది రూ. 5.37 లక్షలు వచ్చిందన్నారు. ఈ ఏడాది రూ. 12,000 ఆదాయం వచ్చినట్లు ఆయన తెలిపారు.

కౌలు కార్డులపై రైతులకు అవగాహన

ఆళ్లగడ్డ మే 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని బాచేపల్లి, ఆర్ కృష్ణాపురం, ఎస్ లింగందిన్నె గ్రామాల్లోని రైతులకు గురువారం వ్యవసాయశాఖాధికారి కిషోర్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో కౌలు కార్డులపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల పెద్దలు, రైతులు, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

పిడుగు పడి రెండు గడ్డివాములు దగ్ధం

దొర్నిపాడు, మే 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని క్రిష్టిపాడు గ్రామంలో బుధవారం రాత్రి ఈదురుగాలులతో, ఉరుములు, మెరుపులతో వర్షం కురిసింది. పిడుగుపడి రెండు గడ్డివాములు దగ్ధమయ్యాయి. దీంతో రూ.3 లక్షలు నష్టం వాటిల్లింది. క్రిష్టిపాడు గ్రామానికి చెందిన మడ్డి నాగరాజు, సుబ్బారావులకు చెందిన గడ్డి వాములలో పిడుగు పడటంతో గడ్డివాములు కాలాయి. చుట్టుపక్కల వారు గమనించి సమాచారం ఇవ్వడంతో గ్రామస్థులు, జేసీబీ సాయంతో వేరే గడ్డివాములకు మంటలు వ్యాపించకుండా నీళ్లు చల్లారు. పశువుల కోసం గడ్డివామి నిల్వ చేసుకున్నామని, పిడుగు పడి గడ్డివామి కాలడంతో పశుగ్రాసం కొరత ఏర్పడిందని రైతులు మడ్డి నాగరాజు, సుబ్బారావు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

రుద్రవరంలో తాగునీటి ఎద్దడి

రుద్రవరం, మే 15 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన రుద్రవరంలో తాగునీటి ఎద్దడి నెలకొంది. ఇరవై రోజులుగా ఇబ్బందులు పడుతున్నట్లు బలిజకాలనీవాసులు తెలిపారు. అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. పైపులైన్ల వద్ద అరకొరగా వస్తున్న నీటిని బిందెల్లో నింపుకుంటున్నామన్నారు. నీటి సమస్య పరిష్కరించాలని ప్రజలు కోరారు. ఈ విషయంపై ఈవో సుబ్బారావు స్పందిస్తూ భూగర్భజలాలు తగ్గిపోయాయన్నారు. పైపులు పెంచి నీటి కొరత నివారిస్తామన్నారు.

దేవాలయ భూములకు కౌలు వేలం

రుద్రవరం, మే 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెద్దకంబలూరు గ్రామంలో ఆంజనేయస్వామి దేవాలయ భూములకు గురువారం కౌలు వేలం నిర్వహించినట్లు ఈవో రామాంజనేయశర్మ తెలిపారు. ఈవేలంలో గత ఏడాది కంటే రూ.14వేలు ఆదాయం తగ్గింది. గత ఏడాది రూ.3.58 లక్షలు ఆదాయం రాగాప్రస్తుతం రూ.3.44 లక్షలే ఆదాయం వచ్చిందన్నారు. వచ్చిన ఆదాయాన్ని ప్రభుత్వ ఖాతాకు జమ చేస్తామని ఈవో తెలిపారు.

ఆటోలో రేషన్ బియ్యం తరలింపు

రుద్రవరం, మే 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దకంబలూరు గ్రామంలో ఆటోలో రేషన్ బియ్యం తరలించినట్లు గురువారం స్థానికులు తెలిపారు. ఇంటింటి వద్ద రేషన్ బియ్యాన్ని సేకరించి ఒక్కసారిగా ఇతర ప్రాంతానికి ఆటోలో రేషన్ బియ్యం బస్తాలను తరలిస్తున్నారు. కేజీల ప్రకారం గ్రామమంతా బియ్యం కొనుగోలు చేసి తరలిస్తున్నారని స్థానికులు చెప్పారు.

చెన్నకేశవుడికి మహర్దశ

- ఆలయ జీర్ణోద్ధరణకు రూ.2.21కోట్లు నిధులు
- శివాలయాన్ని కూడా అభివృద్ధి చేస్తా: మంత్రి బీసీ

సంజామల, మే 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని పేరు సోమలలో వెలిసిన చెన్నకేశవస్వామికి మహర్దశ రానుంది. రాయల కాలంలో నిర్మించిన ఈ ఆలయం శిథిలావస్థకు చేరుకుంది. ఆలయ అభివృద్ధికి గ్రామ పెద్దలు నడుంకట్టారు. ఆలయం వెలుపల దశాబ్దాల కాలం నుంచి పూడికతో నిండిపోయిన చిన్న కోనేరు, పెద్ద కోనేరులను 'మన ఊరు మన గుడి' కార్యక్రమంలో భాగంగా శుభ్రం చేసుకు న్నారు. ఆలయ జీర్ణోద్ధరణ పనులు జరిపిం చాలని గ్రామపెద్దలు టీడీపీ నాయకులు సురేష్ రెడ్డి, శంకర్‌రెడ్డి, శీలా వెంకటేశ్వర్లు, శ్రీనివాసు లు, జగదీశ్వరరెడ్డి, నాగిరెడ్డి మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డికి విషయాన్ని తెలిపారు. ఈ విషయంపై స్పందించిన మంత్రి బీసి ఈ నెల 4న ఆలయాన్ని సందర్శించి స్వామి వారిని దర్శించారు. శ్రీవాణి ట్రస్ట్ ద్వార ఆలయ జీర్ణోద్ధరణకు 2.21కోట్ల నిధులను విడుదల చేయిం చారు. ఈ నిధులతో ఆలయం లో ఫ్లోరింగ్, ఆలయం చుట్టూ ప్రహరీ, విమానాల నిర్మాణం, శిథిలావస్థకు చేరుకున్న ధ్వజస్తంభం, ఆయా నిర్మాణ పనులు తన చేతులమీదు జరగడం భగవత్ సంకల్పమేనని మంత్రి పేర్కొన్నారు. ఈ పనులను వేగవంతంగా పూర్తి చేసే బాధ్యత తీసుకుంటామన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం శ్రీవాణి ట్రస్టు నుంచి నిధులను విడుదల చేయించామన్నారు. ఇంతటి మహోత్తరమైన పురాతనమైన దేవాలయానికి దాతలు చేదోడుగా నిలవడం ఎంతో అభినందనీయమని దాతలతోపాటు గ్రామ పెద్దలు అండగా ఉంటున్నారన్నారు.


పేరుసోములలో చెన్నకేశవస్వామి ఆలయంలో జీర్ణోద్ధరణ పనులకు భూమి పూజ చేస్తున్న మంత్రి బీసీ (ఫైల్)


పెద్ద కోనేరును పరిశీలిస్తున్న మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి (ఫైల్)

కోనేరు అభివృద్ధికి సహకరిస్తా: మంత్రి

పేరుసోములలోని పెద్ద కోనేరు శిథిలావస్థకు చేరుకుందని కోనేరు అభివృద్ధికి సహకరిస్తామన్నారు. ఈ సందర్భంగా ఆయన కోనేరును పరిశీలించారు. వందల సంవత్సరాల క్రితం నిర్మించిన రాతి గోడలు ఒకవైపు పడిపోయాయన్నారు. కోనేరుతో పాటు శివాలయాన్ని కూడా అభివృద్ధి చేస్తానని మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి పేర్కొన్నారు.

4 గంటలు కిలోమీటర్లు

- ప్రధాన రహదారిలో నిలిచిపోయిన లారీ
- స్తంభించిన ట్రాఫిక్
- ఇబ్బంది పడిన ప్రయాణికులు

కొలిమిగుండ్ల, మే 15 (ఆంధ్రజ్యోతి) : అనంతపూర్-అమరావతి ప్రధాన రహదారిలో 18టైర్ల పెద్ద లారీ ఇరుక్కుపోవడంతో 4 గంటల పాటు ట్రాఫిక్ స్తంభించిపోయింది. గురువారం మధ్యాహ్నం మండలంలోని రాయల్టీ చెక్‌పోస్టు సమీపంలో అనంతపూర్ జిల్లా సరిహద్దు ప్రాంతంలో కొండల వద్ద ప్రమాదవశాత్తు రహదారికి అడ్డంగా లారీ నిలిచిపోయింది. ఓవైపు కొండ, మరోవైపు వంక కావడం లారీ రోడ్డుకు అడ్డంగా ఇరుక్కుపోవడంతో ప్రత్యామ్నాయ దారిలేక వాహనాల రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. జాతీయ రహదారి కావడంతో పెద్దఎత్తున ఆర్టీసీ బస్సులు, లారీలు, ట్రాక్టర్లు, ఇతర వాహనాలు నాలుగు కిలోమీటర్ల మేర నిలిచిపోయాయి. దీంతో మండుటెండలో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. కొలిమిగుండ్ల సీఐ రమేష్‌బాబు ఘటనా స్థలానికి చేరుకొని లారీ తొలగించి, ట్రాఫిక్ పునరుద్ధరించడానికి తీవ్రంగా శ్రమించారు. ఎట్టకేలకు స్థానికులు, అల్ట్రాటెక్ సిబ్బంది సహకారంతో లారీని తొలగించడంతో వాహనదారులు, ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు.


రోడ్డుకు అడ్డంగా నిలిచిన లారీ


నిలిచిన వాహనాలు

వైభవంగా పాండురంగ స్వామి రథోత్సవం

కోవెలకుంట్ల, మే 15 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో వెలసిన పాండురంగ విఠలేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం నిర్వహించిన పాండురంగని రథోత్సవ కార్యక్రమం అత్యంత వైభవంగా సాగింది. ఉదయం పాండురంగ స్వామికి పూర్ణాహుతి నిర్వహించారు. సాయంత్రం 4:30గంటలకు మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి కోవెలకుంట్లలోని పాండురంగ స్వామి దేవాలయానికి చేరగానే టీడీపీ నాయకులు గువ్వల సుబ్బారెడ్డి, గడ్డం నాగేశ్వర్‌రెడ్డి, ప్రసాద్‌రెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ గుద్దేటి గుండయ్య, పెనుగొండ రాజశేఖర్ ఘన స్వాగతం పలికారు. అనంతరం స్వామివారికి మంత్రి ప్రత్యేక పూజలు చేసి రథాన్ని లాగి ప్రారంభించారు. అశేష జనవాహిని మధ్య ఈ కార్యక్రమం వైభవంగా సాగింది. చెక్కభజన , సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. రథోత్సవం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీఐ హనుమంత నాయక్ ఆధ్వర్యంలో భారీ బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు అన్నదాత గిరీష్‌కుమార్, కార్యకర్తలు పాల్గొన్నారు.


కోవెలకుంట్ల: రథోత్సవంలో పాల్గొన్న మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి

అవుకు చెన్నకేశవస్వామి ఆలయంలో..

అవుకు : పట్టణంలో వెలసిన శ్రీభూలక్ష్మీ సమేత చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. దేవాదాయశాఖ ఆధ్వర్యంలో మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి సహకారంతో స్వామివారి బ్రహ్మోత్సవాలను అంగరంగ వైభగంగా నిర్వహించారు. అర్చకులు ఆలయం నుంచి ఉత్సవమూర్తులను పల్లకిలోకి చేర్చి రథం వద్దకు తీసుకువచ్చారు. భక్తులు రథాన్ని లాగారు. రథోత్సవాన్ని తిలకిం చేందుకు ప్రజలు అధిక సంఖ్యలో తరలిరావటంతో వీధులన్నీ కిక్కిరిసిపోయాయి. అవాంచనీయ ఘటనలు జరుగకుండ బనగానపల్లె సీఐ మంజునాథరెడ్డి, ఎస్ఐరాజారెడ్డి ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు. నాయకులు ఐ.ఉగ్రసేనారెడ్డి, వెంకటరమణనాయక్, బత్తిన మద్దిలేటి గౌడు, తిక్కన్న, దంతెలరమణ, అరుణ్‌కుమార్‌నాయక్, వెంకటరాముడు నాయక్ పాల్గొన్నారు.


అవుకు: రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

నేడు జాతీయ స్థాయి ఎద్దుల పోటీలు

చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి ఆధ్వర్యంలో జాతీయస్థాయి ఎద్దుల పోటీలను అవుకు జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో శుక్రవారం ఏర్పాటు చేశారు. మంత్రి బీసీ ఎద్దుల పోటీలను ప్రారంభించనున్నారు. మొదటి బహుమతి రూ. లక్ష, రెండవ బహుమతి రూ. 80వేలు, మూడవ బహుమతి రూ. 60 వేలు, నాలగవ బహుమతి రూ. 40వేలు, అయిదవ బహుమతి రూ. 20 వేలు, ఆరవ బహుమతి రూ. 10 వేలుగా ప్రకటించినట్లు నిర్వాహకులు వెంకటరమణనాయక్ తెలిపారు.

ప్రజలకు రక్షిత మంచినీరు అందించాలి

రుద్రవరం, మే 15 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు రక్షిత మంచినీరు అందించాలని ఎంపీడీవో భాగ్యలక్ష్మి అన్నారు. గురువారం మండలంలోని కె.కొత్తూరు, యల్లావత్తుల, కోటకొండ, చిన్నకంబలూరు గ్రామాల్లో ఆర్వో ప్లాంటు ఇన్‌లైన్ క్లోరినేషన్ తనిఖీ చేశారు. ఎంపీడీవో మాట్లాడుతూ ప్రజలకు రక్షిత మంచినీరు అందించడంలో నిర్లక్ష్యం చేయవద్దని హెచ్చరించారు. సకాలంలో ప్రజలకు నీరందించాల్నారు. అలాగే వర్క్‌ఫ్రంహోం, మనమిత్ర, ఆధార్ లేని పిల్లల వివరాలుతో పాటు అన్ని సర్వేలను వేగవంతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో కార్యదర్శులు పాములేటి, కొండయ్య తదితరులున్నారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చూడండి

దొర్నిపాడు, మే 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆయా గ్రామాల్లోని ప్రజలకు తాగునీటి సమస్య లేకుండా చూడాలని ఎంపీడీవో సుభద్ర అన్నారు. గురువారం మండలంలోని రామచంద్రాపురం గ్రామంలోని ఫిల్టర్ వాటర్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందేలా చూడాలన్నారు. గ్రామాల్లో అపరిశుభ్రత లేకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ నాగఅనసూయ, పంచాయతీ కార్యదర్శులు నాగార్జున, మహేష్ ఉన్నారు.

గాలివాన బీభత్సం

రుద్రవరం, మే 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలో బుధవారం అర్ధరాత్రి ఉరుములు మెరుపులతో కూడిన గాలివాన బీభత్సం సృష్టించింది. చిన్నకంబలూరు గ్రామ సమీపంలో ఆర్అండ్‌బీ రోడ్డుపై వృక్షం పడింది. రాకపోకలు నిలిచిపోయాయి. పేరూరు, బినాగిరెడ్డిపల్లె గ్రామాల మధ్య రహదారిపై వృక్షాలు పడ్డాయి. రెడ్డిపల్లె మెట్ట వద్ద వృక్షంపై పిడుగు పడడంతో వృక్షం నిలువునా చీలింది. రుద్రవరం మండలంలో 50.8 ఎంఎం వర్షపాతం నమోదైంది. వెలగలపల్లెల పంట పొలంలో వరి ధాన్యం తడిసిపోయింది. యల్లావత్తుల నుంచి కోటకొండ, చెంచుగూడెం వరకు వరి ధాన్యం మొక్కజొన్నలు రహదారి వెంట తడిచి ముద్దయ్యాయి. రైతులు మొక్కజొన్నలను మరో ప్రాంతానికి ట్రాక్టర్లలో తరలించారు. మరికొందరు రైతులు తడిచిన ధాన్యన్ని రహదారిపై ఆరబెట్టారు.


చిన్నకంబలూరులో రహదారికి అడ్డంగా పడిన చెట్టు

చాగలమర్రిలో..

చాగలమర్రి: చాగలమర్రి గ్రామంలో గురువారం తెల్లవారుజామున వర్షం కురిసింది. 3.3 మీ.మీ వర్షపాతం నమోదైంది. ఆయా గ్రామాల సర్వీసు రహదారుల్లో ఆరబెట్టుకున్న మొక్కజొన్న తడిచి దెబ్బతింది. చింతలచెరువు, శెట్టివీడు, పెద్దవంగలి తదితర గ్రామాల్లో కోతకు వచ్చిన కొర్ర, నువ్వు పంటలు నేలవాలి దెబ్బతిన్నాయి. తేలికపాటి వర్షం పడటంతో కంకులు నల్లబారి నష్టపోవాల్సి వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఉక్కపోతతో అల్లాడుతున్న ప్రజలకు ఈ వర్షం ఊరటనిచ్చింది.

డోన్‌లో..

డోన్ రూరల్: మండలంలో గురువారం తెల్లవారుజామున కురిసిన వర్షంతో వాతావరణం చల్లబడింది. మండలంలో 26 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైందని మండల వ్యవసాయాధికారి అబ్దుల్ షఫీ తెలిపారు. ఖరీఫ్ సీజన్‌కు సిద్ధమవుతున్న రైతులకు ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు ప్రయోజనకరంగా మారనున్నాయని తెలిపారు.

నేటి నుంచి రాములోరి విగ్రహ ప్రతిష్ఠ పూజలు

డోన్ రూరల్, మే 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకటనాయునిపల్లెలో శుక్రవారం నుంచి రాములోరి విగ్రహ ప్రతిష్ఠ పూజలు ప్రారంభం కానున్నాయి. గ్రామ ప్రజలు, పెద్దల ఆధ్వర్యంలో ఈ నెల 16 నుంచి 18వరకు సీతారాముల ధ్వజస్తంభ ప్రతిష్ఠ, స్వామివారి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఆదివారం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

ఏపీఆర్‌జేసీ పరీక్షల్లో విద్యార్థిని ప్రతిభ

ప్యాపిలి, మే 15 (ఆంధ్రజ్యోతి): ఏపీఆర్‌జేసీ ప్రవేశ పరీక్షల్లో మండలంలోని పీఆర్‌పల్లి ప్రభుత్వ ఉన్నతపాఠశాల విద్యార్థిని లహరి ప్రతిభ కనబరిచింది. మంచిమార్కులు పొంది రాష్ట్రస్థాయిలో 1162వ ర్యాంక్ సాధించింది. లహరి ఏపీఆర్‌జేసీలో ర్యాంకు సాధించడంపై ఉపాధ్యాయులు, గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మొదటి విడత పుస్తకాలు మంజూరు

కొలిమిగుండ్ల, మే 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వివిధ గ్రామాల పాఠశాలలకు పాఠ్య, నోట్ పుస్తకాలు, యూనిఫామ్ వచ్చినట్లు మండల విద్యాధికారి అబ్దుల్‌కలాం గురువారం వెల్లడించారు. మొదటి విడత కింద 12,669 పాఠ్య పుస్తకాలు, 23,168నోటు పుస్తకాలు, 3,799 దుస్తులు వచ్చినట్లు ఆయన తెలిపారు. రెండవ విడత పుస్తకాలు త్వరలోనే అందుబాటులోకి వస్తాయని, పాఠశాలలు పునః ప్రారంభం అయ్యే లోపు విద్యార్థులకు అందజేస్తామని ఎంఈవో తెలిపారు.

రేపు మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి పర్యటన

కొలిమిగుండ్ల, మే 15 (ఆంధ్రజ్యోతి) : మండలకేంద్రంలో శనివారం మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి పర్యటించనున్నట్లు ఎంపీడీవో ప్రసాదరెడ్డి గురువారం వెల్లడించారు. ఈసందర్భంగా మండల స్థాయి అధికారులతో సమీక్షా సమావేశం ఏర్పాటు చేయడంతో పాటు, ర్యాలీలో పాల్గొంటారని ఆయన తెలిపారు. మరోవైపు పలు అభివృద్ధి కార్యక్రమాలను ఆయన ప్రారంభించనున్నట్లు వెల్లడించారు.

దుకాణదారులకు నోటీసులు

ఉయ్యాలవాడ, మే 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని దుకాణదారులకు నోటీసులు జారీ చేసినట్లు ఎంపీడీవో ఉమామహేశ్వరరావు తెలిపారు. గురువారం ఉయ్యాలవాడ, మాయలూరు, తుడుమలదిన్నె తదితర గ్రామాల్లో నోటీసులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సౌభాగ్య పౌడర్(పేడలో కలిపే రంగు) హానికరమైనదని, దాన్ని దుకాణాల్లో విక్రయించరాదన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శులు జయరామిరెడ్డి, సువర్ణ, ఇంజనీరింగ్ అసిస్టెంటు ప్రభాకర్ తదితరులున్నారు.

సాయిబాబాకు క్షీరాభిషేకం

చాగలమర్రి, మే 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక సాయినాథ మందిరంలో గురువారం సాయిబాబాకు క్షీరాభిషేకం, రుద్రాభిషేకం పూజలు చేశారు. వేద పండితుడు పవన్‌కుమార్ ఆధ్వర్యంలో మహిళలు సామూహికంగా సాయివ్రతం, పల్లకి ఉత్సవం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కౌలు రైతులకు గుర్తింపు కార్డులు తప్పనిసరి

చాగలమర్రి, మే 15 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లోని కౌలు రైతులకు గుర్తింపు కార్డు తప్పనిసరి అని ఏవో రంగనేతాజీ సూచించారు. గురువారం చాగలమర్రి గ్రామంలోని 3వ రైతు సేవాకేంద్రంలో పంట సాగు హక్కు పత్రాల గురించి కౌలు రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఈవో మంజుల, వీఆర్వో శారద, వీహెచ్ఏ సుబ్బరాయుడు, రైతులు పాల్గొన్నారు.

శిరివెళ్ల : పొలాలను కౌలుకు తీసుకుని సాగు చేస్తున్న రైతులు తప్పనిసరిగా సీసీఆర్సీ(పంట సాగుదారు హక్కుల కార్డు) కార్డులను పొందాలని మండల వ్యసాయాధికారి సుధాకర్ సూచించారు. గురువారం కోటపాడు, గోవిందపల్లె గ్రామాల్లో వ్యవసాయశాఖ, రెవెన్యూ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో కౌలు రైతుల అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో వీఆర్వోలు రసూల్, నరసింహుడు, వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

బేతంచెర్ల: నగర పంచాయతీ పరిధిలోని బుగ్గాని పల్లె గ్రామంలో కౌలు రైతులకు కౌలుపత్రాలుపై అవగాహన సదస్సును గురువారం నిర్వహించారు. కార్యక్రమంలో వ్యవసా యా ధికారి కిరణ్‌కుమార్ , బుగ్గానిపల్లె హార్టికల్చర్ అసిస్టెంట్ శివ, కౌలు రైతులు పాల్గొన్నారు.

రేషన్ సక్రమంగా పంపిణీ చేయాలి

చాగలమర్రి, మే 15 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ఎండీయూ ఆపరేటర్లు రేషన్‌ను సక్రమంగా పంపిణీ చేయాలని డిప్యూటీ తహసీల్దార్ విజయ్‌కుమార్ ఆదేశించారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ తోడెండ్లపల్లె గ్రామంలో రేషన్ దుకాణాన్ని తనిఖీ చేశామన్నారు. చక్కెర, బియ్యం సంబంధించిన రికార్డులను పరిశీలించగా స్టాక్ వివరాలు సరిగా లేకపోవడంతో ఆర్డీవోకు నివేదికలు పంపించామన్నారు. ఆర్డీవో విచారణ అనంతరం డీలర్‌పై తగు చర్యలు తీసుకుంటామ న్నారు.

ఉపాధి కూలీల సంఖ్య పెంచాలి

చాగలమర్రి, మే 15 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ఉపాధి కూలీల సంఖ్య పెంచాలని ఏపీవో ఖాసీం అన్నారు. గురువారం చింతల చెరువు గ్రామంలో జరుగుతున్న పంట కాలువ పూడిక పనులను పరిశీలించారు. పనులకు వచ్చిన కూలీల మస్టర్లను పరిశీలించి మస్టర్లు సక్రమంగా నిర్వహించాలని సూచించారు. మస్టర్‌లో అవకతవకలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఏడు బృందాలతో భూ రీసర్వే

చాగలమర్రి, మే 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బ్రాహ్మణ పల్లె, చింతలచెరువు గ్రామాల్లో ఏడు బృందాలతో భూ రీసర్వే పనులు చేపట్టినట్లు తహసీల్దార్ రవికుమార్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ చింతలచెరువు గ్రామంలో ఐదుటీంలు, బ్రాహ్మణ పల్లెలో రెండు టీంలు భూరీసర్వే చేస్తున్నారని తెలిపారు. కార్యక్ర మంలో మండల సర్వేయర్ మద్దిలేటి, సర్వేయర్లు, వీఆర్వోలు, వీఆర్ఏలు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం

డోన్ రూరల్, మే 15 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాతబస్టాండులో పేదలకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. నందీష్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో పేదలకు అన్నదానం చేశారు. రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన నందీష్ జ్ఞాపకార్థంగా రెండు సంవత్సరాలుగా నందీష్ చారిటబుల్ ట్రస్టు పేరుతో పేదలకు అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ట్రస్టు సభ్యులు, కుటుంబ సభ్యులు, మిత్రులు తెలిపారు.

నేడు మాజీ మంత్రి బుగ్గన డోన్‌కు రాక

డోన్ టౌన్, మే 15 (ఆంధ్రజ్యోతి): ఆర్థికశాఖ మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి శుక్రవారం ఉదయం డోన్‌కు రానున్నట్లు వైసీపీ నాయకులు గురువారం సాయంత్రం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని వైసీపీ కార్యాలయానికి వస్తున్నట్లు పేర్కొన్నారు. నాయకులు, కార్యకర్తలు అభిమానులు రావాలని కోరారు.

గార్లదిన్నెలో వైద్య శిబిరం

ప్యాపిలి, మే 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గార్లదిన్నె గ్రామంలో గురువారం వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. శ్రీనివాసశెట్టి, ఉమామహేశ్వరమ్మ దంపతుల జ్ఞాపకార్థం వైద్య శిబిరాన్ని నిర్వహించారు. నంద్యాల శాంతిరామ్ ఆస్పత్రి వైద్యులు రోగులకు కంటి, గుండె, బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు సీమ సుధాకర్‌రెడ్డి, సర్పంచు మనోహరమ్మ గ్రామస్థులు పాల్గొన్నారు.

వృద్ధురాలి ఆత్మహత్య

బనగానపల్లె, మే 15 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ఓంశాంతి కాలనీకి చెందిన మంగలి రామక్క (80) ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ దుగ్గిరెడ్డి గురువారం తెలిపారు. ఎస్ఐ మాట్లాడుతూ ఇంట్లో ఎవరు లేని సమయంలో రామక్క క్రిమిసంహారిక మందును తాగి ఆత్మహత్య చేసుకుందన్నారు. కుటుంబసభ్యులు గమనించి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, మృతిచెందినట్లు డాక్టర్లు ధ్రువీకరించారన్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెల్లడించారు.